

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 236 | మంగళవారం 01 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3


## యూపీలో విషాదం.. బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుళ్లు, 11 మంది మృతి





వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి కృష్ణా జలాలను విడుదల చేసిన సీఎం చంద్రబాబు

పంచెకట్టులో కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు, హారతి.. సాష్టాంగ నమస్కారం

రాబోయే తరాల కోసం పనిచేస్తా, ఓట్ల కోసం కాదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి

ఇక మార్కాపురం టైం మొదలైందని, ఈ ప్రాంతం అన్‌స్టాపబుల్ అని వ్యాఖ్య

ఉద్యమకారుడు పూలసుబ్బయ్య కుటుంబ సభ్యులను సత్కరించిన చంద్రబాబు

2లో

# కృష్ణమ్మను.. తీసుకొచ్చాం

## కరవును తరిమికొట్టాం





మార్కాపురం, ఛీఫ్ బ్యూరో నందిపత్రిక

ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత వాసుల దశాబ్దాల కలను సాకారం చేస్తూ, వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చారిత్రక ఘట్టంలో పాల్గొని, కృష్ణా జలాలను పవిత్రమైన పూజలతో ఆహ్వానించి ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సంప్రదాయ పంచెకట్టులో ప్రాజెక్టు వద్దకు చేరుకుని అందరినీ ఆకట్టుకున్నారు. కృష్ణా జలాల్లోకి స్వయంగా దిగి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, హారతి ఇచ్చారు. ఫీడర్ కాలువ వద్ద ఉరకలేస్తున్న కృష్ణమ్మ ప్రవాహాన్ని చూసి భావోద్వేగానికి లోనైన ఆయన, నేలపై సాష్టాంగ నమస్కారం చేసి తన కృతజ్ఞతను చాటుకున్నారు. అనంతరం స్థానిక రైతులు, నిర్వాసితులతో కలిసి స్విచ్ నొక్కి గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు.

## వెలిగొండపై మాటల యుద్ధం..



వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం... టీడీపీ, వైసీపీ విమర్శల పర్వం

నీళ్లు లేకుండానే జగన్ ప్రాజెక్టును ప్రారంభించారంటూ లోకేశ్ ఎద్దేవా

తొలి దశ పూర్తి చేసి నల్లమల సాగర్‌లోకి నీటిని విడుదల చేసిన చంద్రబాబు

తన తండ్రి, తన ఘనతేనంటూ ముందురోజు పోస్ట్ పెట్టిన జగన్

ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని పలు వెనుకబడిన ప్రాంతాల దశాబ్దాల కలను సాకారం చేసే వెలిగొండ ప్రాజెక్టు, ఇప్పుడు తెలుగుదేశం, వైసీపీల మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది. మంత్రి నారా లోకేశ్.. వైసీపీ అధినేత జగన్









## జగన్ రాకతో వెలిగొండకు గ్రహణం

### కూటమి వచ్చాకే పనులు పూర్తి

### జలవనరుల మంత్రి నిమ్మల విమర్శలు



వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్వాకాలను మంత్రి నిమ్మల రామానాయుడు కడిగిపారేశారు. వెలిగొండ పేరుతో జగన్ చేసిన మోసాన్ని సభలో ఆసాంతం వివరించారు. 2019-2024 మధ్య కాలంలో వెలిగొండ పేరుతో చేసిన దుర్మార్గాలను ఎండగట్టారు. టన్నెల్-2లో టన్నెల్ బోరింగ్ మిషన్ తీయడానికి కనీస ప్రయత్నం చేయకుండానే.. రూ. 2 వేల కోట్లకు పైగా పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితమంటూ ఆనాడు జగన్ డ్రామాలాడారంటూ విరుచుకుపడ్డారు.

## వెలిగొండపేరుతో మోసం చేసిన జగన్

### పూర్తికాకుండానే జాతికి అంకితం చేయడం దుర్మార్గం

### ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి



వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశానంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ రెడ్డి మోసం చేశారంటూ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ వేదికపై జగన్‌పై ఎంపీ విరుచుకుపడ్డారు. జగన్ ఓ మూర్ఖుడంటూ వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం జరిగిన తీరు చూస్తుంటే భావోద్వేగంతో కళ్ల వెంబడి నీళ్లు తిరుగుతున్నాయన్నారు. మార్కాపురం ప్రజలు, రైతులకు మేలు చేసేలా వెలిగొండ ప్రాజెక్ట్‌ను సీఎం చంద్రబాబు పూర్తి చేశారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం సాయం అందించిందని చెప్పారు.

## దశాబ్దాల కల నెరవేరిన తరుణమిది

### వెలంగొండ ప్రారంభంపై ఎక్స్ వేదికగా పవన్ హర్షం



దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ ప్రారంభంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ కృష్ణా జలాలు కరవు పీడిత ప్రాంతాలకు చేరనున్న ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని హృదయ పూర్వకంగా స్వాగతిస్తున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం కావడం మార్కాపురం, ప్రకాశం, కడప, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల ప్రజలకు ఎనలేని సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు తొలి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు సాకారం కావడానికి మూడు దశాబ్దాలుగా కృషి చేసిన ఇంజినీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, ప్రజా సంస్థలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.



## వెలిగొండ ప్రాజెక్టు వద్ద కృష్ణా నీళ్లను నెత్తిన చల్లుకుని, బాటిళ్లతో పట్టుకెళ్లిన జనం



# హిమాలయమాల్లో వాటర్ బాంబ్స్ !

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు మరోసారి హిమాలయ ప్రాంతాల్లోని హిమానీనద సరస్సులపై ఆందోళనలను పెంచాయి. ముఖ్యంగా భారత్ ఎగువన హిమాలయాల్లో హిమానీ నదాల పరిస్థితిపై ఆందోళన కలుగుతోంది. మనదేశంలో అలాంటి ఉపద్రవమే జరిగితే పలు రాష్ట్రాలు కొట్టుకుపోక తప్పదు. హిమానీనదాల కరిగే ప్రక్రియలో ఏర్పడే సరస్సుల్లో భారీ మొత్తంలో నీరు నిల్వ ఉంటుంది. వీటిని నియంత్రించే సహజ మంచు, రాళ్లు లేదా మట్టి అడ్డంకులు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది. భారీ వర్షాలు, హిమానీనదాల కరుగుదల, కొండచరియలు విరిగిపడటం, భూకంపాలు వంటి కారణాలతో సరస్సు అడ్డంకులు తెగిపోతే దిగువ ప్రాంతాలకు ఒక్కసారిగా భారీగా నీరు, బురద, రాళ్లు, మట్టి కొట్టుకురావచ్చు. అందుకే ప్రమాదకర హిమానీనద సరస్సులను నిపుణులు కొన్నిసార్లు 'వాటర్ బాంబ్స్'గా అభివర్ణిస్తారు. నేపాల్‌లో జరిగిన వరదలు హిమాలయ ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలు ఎంత వేగంగా భారీ విపత్తులుగా మారగలవో మరోసారి చూపిస్తున్నాయి. ముఖ్యంగా హిమానీనద సరస్సుల సంఖ్య, వాటి నీటి నిల్వ సామర్థ్యం, వాతావరణ మార్పుల ప్రభావం, పర్వత ప్రాంతాల్లో పెరుగుతున్న నిర్మాణాలు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. హిమాలయాల్లోని హిమానీనద సరస్సుల ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేస్తే, పర్వత ప్రాంతాలతో పాటు దిగువ మైదాన ప్రాంతాల్లోనూ భారీ వరదలు సంభవించే అవకాశం ఉంది. అందుకే ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, ఉపగ్రహ పర్యవేక్షణ, ప్రమాద మ్యాపింగ్, శాస్త్రీయ ఇంజనీరింగ్ చర్యలు అత్యంత కీలకంగా మారుతున్నాయి. నేపాల్-టిబెట్ సరిహద్దులో హిమానీనదం విస్ఫోటనం కారణంగా భోటేకోశి, త్రిశూలి నదుల్లో భారీగా వరదలు సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనతో మధ్య నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలు, టిబెట్‌లో నదీ మూల ప్రాంతానికి సమీపంలో కొత్తగా తాత్కాలిక సరస్సు ఏర్పడటంతో భోటేకోశి నదిలో నీటిమట్టం మళ్లీ పెరిగినట్లు సమాచారం. దీంతో దిగువ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తత ప్రకటించారు. నేపాల్‌లో జరిగిన ఈ ఘటనతో ఇప్పుడు భారత హిమాలయ ప్రాంతాల్లో ఉన్న హిమానీనద సరస్సుల భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సీనియర్ సలహాదారు ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలోని 11 నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 28,000 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వాటిలో దాదాపు 7,500 సరస్సులు భారతదేశంలోనే ఉన్నట్లు అంచనా. ఒక్క గంగా నదీ పరీవాహక ప్రాంతంలోనే 4,700కు పైగా హిమానీనద సరస్సులు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే వీటిలో కొన్ని సరస్సులు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 195 నుంచి 200 సరస్సులను అధిక ప్రమాదం ఉన్న సరస్సులుగా గుర్తించినట్లు సమాచారం. నేపాల్‌లోని ఘటనలో సహజ పరిస్థితులతో పాటు మానవ కార్యకలాపాలు కూడా నష్టాన్ని పెంచినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. టిబెట్, నేపాల్‌లోని పర్వత ప్రాంతాల్లో పర్యావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టడం, నదుల సహజ ప్రవాహ ప్రాంతాల్లో నివాసాలు ఏర్పడటం వంటి కారణాలు ప్రమాద తీవ్రతను పెంచే అవకాశం ఉంది. అదేవిధంగా, ఇజీస చిజీసనితినిణ ఞాబబిఃప (ఇచా) సకాలంలో పనిచేయకపోతే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు తగినంత సమయం లభించదు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. భారత హిమాలయ ప్రాంతంలోని ప్రమాదకర హిమానీనద సరస్సులు పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. హిమాలయ ప్రాంతాల్లోని సరస్సులు పొంగిపొర్లితే ప్రభావం కేవలం పర్వత ప్రాంతాలకే పరిమితం కాకపోవచ్చు. భారీ మొత్తంలో నీరు, మట్టి, రాళ్లు దిగువకు ప్రవహించి నదుల నీటిమట్టాన్ని ఒక్కసారిగా పెంచవచ్చు. ప్రత్యేకంగా నేపాల్ లేదా సిక్కిం ప్రాంతాల్లో భారీ వరదలు సంభవిస్తే కోసి, గండక్, తీస్తా వంటి నదుల ద్వారా నీరు దిగువ మైదాన ప్రాంతాలకు చేరే ప్రమాదం ఉంటుంది. దీంతో ఉత్తర బీహార్‌లోని సుపాల్, సహర్సా, మధుబని, చంపారన్ వంటి ప్రాంతాలు, అలాగే ఉత్తర బెంగాల్‌లోని జల్పైగురి, సిలిగురి, డార్జిలింగ్ టెరాయ్ ప్రాంతాల్లో వరద ముప్పు పెరిగే అవకాశం ఉంది. ప్రమాదకర సరస్సులను పర్యవేక్షించేందుకు అధికారులు పలు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

ధిక ప్రమాదం ఉన్న సరస్సుల చుట్టూ ప్రమాద ప్రాంతాలను గుర్తించి, అక్కడ కొత్త నిర్మాణాలు, నివాసాలను నియంత్రించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సరస్సుల్లోని నీటిని సురక్షితంగా బయటకు పంపేందుకు చెక్‌డ్యామ్‌లు, డ్రైనేజీ వ్యవస్థలు, నీటి మళ్లింపు నిర్మాణాలు వంటి చర్యలను పరిశీలిస్తున్నారు. అధిక ప్రమాదం ఉన్న సరస్సుల్లో ఆటోమేటిక్ ముందస్తు హెచ్చరిక సెన్సార్లను ఏర్పాటు చేసే ప్రణాళికలు ఉన్నాయి. నీటి మట్టం, ఉష్ణోగ్రత, ఇతర మార్పులను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. ఉపగ్రహ పర్యవేక్షణ ద్వారా సరస్సుల పరిమాణం, నీటి మట్టం, పరిసర ప్రాంతాల్లో మార్పులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధిక ప్రమాదం ఉన్న హిమానీనద సరస్సుల వద్ద రాబోయే రెండేళ్లలో ఆటోమేటిక్ ముందస్తు హెచ్చరిక సెన్సార్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇలాంటి వ్యవస్థలు పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వస్తే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడం, అవసరమైతే ఖాళీ చేయించడం సులభమవుతుంది.

# ఆరుద్రమహాసముద్రం

"క విత కోసమె నేను పుట్టాను, క్రాంతి కోసం కలం పట్టాను" అన్న ఆరుద్ర పుట్టింది 1925 ఆగస్టు 31. ప్రయోగ వాదిగా, అంత్య ప్రాసల ముద్ర ఆరుద్రగా పలు ప్రక్రియా వైవిధ్య సంభరితుడుగా, సినిమా కవిగా తెలుగు సాహిత్యంలో ఆరుద్ర ప్రత్యేక స్థానాన్ని పదిలపరచుకొన్నాడు. "నీలాల నింగిలో ఎర్ర జెండా తోడ, విశ్వ వీణా రవపు విజయ గానమ్ముతో విజయ శంఖారావ విశ్వగీతమ్ముతో కొత్త మార్గాలపై, కొత్త మార్గాలకై కదలవే, కదలవే" అని బావుటా ఎగరేసి కవిత్వపు కాగడాను తన 17వ యేట 1942 లోనే పట్టి పురోగమించారు. ఆయన ఇంటరు మొదటి సంవత్సరం వరకే చదివారు. ఇంటరులో ఆయనకు ఇంగ్లీషు చెప్పిన గురువు రోణంకి అప్పలస్వామి. ఆరుద్ర తన 'త్వమేవాహం' కావ్యాన్ని వారికే అంకితమిచ్చారు. ఆరుద్ర 1948 జులై 10 తర్వాతే 'త్వమేవాహా'న్ని మొదలుపెట్టినప్పటికీ ప్రథమ ముద్రణ వెలువడింది జులై 1949. 'త్వమేవాహం' అప్పట్లో సంచలనం. నిజాముకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ పోరాటం నేపథ్యంగా రాయబడిన కావ్యమది. భాషలో ఆరుద్ర ప్రయోగాలు పాఠకులను అదిరిపాటుకు గురి చేశాయి. "బ్రెయిన్‌లో బ్రెన్ గన్, రెయిన్‌లా ఆలోచనల ట్రైన్, స్పయినల్ కార్డులో స్పెయిన్, గ్లూమీ తిమిరాలు చెరిషించి, సైతాను మనల్ని పరిషించునపుడు, నిర్వేదనా పవనాలు వర్షించు, బ్రెయిన్‌లో స్టెన్ గన్లా చెట్లూ చిట్టెలుకలు, చెయిన్సులో మగవాళ్లు, చెరచబడ్డ ఆడవాళ్లు, స్నో తెలుపు, డ్యూతెలుపు" ఇలా బుల్లెట్లలా పదాలు దూసుకొచ్చేసరికి ఆ ఇంగ్లీషు మాటల దూకుడు, ఆ ప్రతీకలు ఆనాటి పాఠకులకు కొరుకుడుపడక వింతగా చూశారు. ఆరుద్ర హృదయాంతర్గత వేదనను, మెదడులోని అలజడిని దాశరథి వివరించిన తరువాత కొంతమందికి అర్థమైంది. దాశరథి 'అగ్నిధార', సోమసుందర్ 'వజ్రాయుధం' రెండూ తెలంగాణా పోరాట నేపథ్యంలో 1949 లోనే వెలువడ్డాయి. "మేధాశోధన నాళికలో కాలాన్ని పోసి, మండుతున్న గుండెల మీద మరగ బెడతాను. మానవాళికి పనికి వచ్చే ఫలితాల కోసం పాటుపడతాను, పాటకడతాను, కాలాన్ని పట్టి తెచ్చి రాటకేసి కట్టేస్తాను. కాలాన్ని మీకు బానిసగా చేస్తాను. కళ్లల్లో జ్యోతులు వెలిగిస్తాను. భూతల స్వర్గానికి తలుపులు తీస్తా"నని తన ఆకాంక్షను కావ్యారంభంలోనే చెప్పారు. కావ్యంలో ప్రతీకల ప్రయోగం అద్భుతం. కాలానికి సంకేతం గడియారం. గడియారం మన సంఘం. ఇసుక గడియారం, నీటి గడియారాలు పాత కాలపు సంఘాలు. గంటలు శ్రీమంతులు. నిముషాలు మధ్యతరగతి వాళ్లు. సెకండ్లు శ్రామికులు. చిన్నముల్లు శ్రీమంతుల మనస్తత్వానికి సూచి. పెద్దముల్లు మిడిల్ క్లాసు వాళ్ల భావాలకు బరామీటరు. సెకండ్ల ముల్లు శ్రామిక జనుల ఫిలాసఫీకి కొలబద్ద. స్టాప్ వాచి విప్లవాన్ని టైం చేసే సాధనం. పెండ్యులం నిలకడలేని ఊగిసలాట మనస్తత్వానికి ప్రతీక. 'కీ' విప్లవానికి ప్రోద్బలకారణం. కాలాన్ని ప్రవాహంగా కూడా భావించారు ఆరుద్ర. మృత్యువుతో పోరాడే తెలంగాణా పౌరుల చైతన్యంతో కవి 'త్వమేవాహ'మన్నాడీ కావ్యంలో. అంటే నువ్వేనేనని అభేదాన్ని చెప్పాడు. "ఈమె అయస్కాంతకాంత" అనే ఖండికలో పన్నెండు పాదాలు పన్నెండు అంకెలకు గుర్తు. పాదానికి ఐదక్షరాలు. ఒక అంకె నుండి ఒక అంకెకు రావటానికి పట్టే ఐదు సెకండ్లకు సూచిక. మొత్తం అరవై అక్షరాలు. అరవై సెకండ్లకు సంకేతంగా నిలుస్తాయి. ఇది గడుసైన శిల్పం. ఆరుద్ర 'టెక్నిక్' లేని కవిత్వాన్ని ఊహించలేనన్నాడు. కెప్టెన్‌ను తండేల్ అనటం, విమానాన్ని గాలిగెద్ద అనటం, డ్రెడ్జర్‌ను తవ్వోడ అనటం లాంటి పద ప్రయోగాలు ఉన్నాయి. దీనిలోనే ఛందః ప్రయోగాలూ ఉన్నాయి. వచన కవితలా సాగిస్తూ ఇది పద్యమే అని అనుమానం రాకుండా మత్తకోకిల, ఉత్సాహం, కవిరాజ విరాజితం, పృథ్వీవృత్తం, తరలం, మందారదామం, లయగ్రాహి, దండకం, కందం లాంటివి పద్యాలు పేర్లు పెట్టకుండా రాశారు. కుందుర్తి 'నగరంలో వాన'లో కూడా ఇలా ఛందః ప్రయోగాలు చేశాడు. వచన కవిత్వమనే అభిప్రాయాన్ని కలిగించారు. ఛందస్సుల రహస్యం తెలిసిన వారే అలా రాయగలరు. "ప్రజ భయపడకూడదు ఇల నిజం గెలుస్తుంది కనుక నీతి వెలుస్తుంది. జరామరణాలిక కల. ధ్వజం కొస నిరంతర సమధర్మం చూస్తాం". ఇది కందపద్యం దీనిలోని సందేశంతోనే 'త్వమేవాహం' ముగుస్తుంది. నిర్దేశించిన భావాలను వాక్యాలు బట్వాడా చేయలేవనుకున్నప్పుడు, ఆంగ్ల పదబంధాలను ఉపయోగించటానికి ఆరుద్ర వెనకాడలేదు. ఈ విధానం, ఆరుద్ర మరొక కావ్యం 'సినీవాలి' లోనూ కొనసాగింది. 'సినీవాలి' అంటే అమావాస్య నాడు కనపడే నెలవంక. ఇది నాలుగేళ్ల కొకసారి మాత్రమే కనిపిస్తుంది. చీకటిలో వెలుగు రేఖ ఉన్నట్లే కష్టాల్లో కూడా ఆశారేఖ ఉంటుందనే అర్థంలో కవి ఈ పదాన్ని గ్రహించాడు. డిగ్రీ చదువుకున్న మధ్యతరగతి యువకుడు సూర్యారావు ఉద్యోగాన్వేషణకు పట్టణానికి వెళ్తాడు. క్లర్కు ఉద్యోగం వస్తుంది. నగరంలో గుమస్తా బతుకు బాధలను నగర జీవనాన్ని ఈ కావ్యంలో ఆరుద్ర చిత్రించారు. పఠాభి 'ఫిడేలు రాగాల డజన్' కావ్యంలో నగర జీవన చిత్రణ ఆరుద్రకు స్ఫూర్తి. ఇందులో నాయకుడు మధ్యతరగతి యువకుడు. కలలబేరగాడు. ఇతడేమంటాడంటే "దావానలతుల్యోజ్వల భావానల కీలలోన పడుతూ ఉంటా, భావాలకు బానిసనై కావాలని గాలిమేడ కడుతూ ఉంటా"నంటాడు. ఇది కంద పద్యం. ఇలా ఆరుద్ర ఛందః ప్రయోగాలు చాలా ఉన్నాయి. 'సినీవాలి' కావ్యంలో నాటకీయత ఉంది. పాత్రలు సూర్యారావు, తండ్రి, ముగ్గురు వధువులు, కవి. సూర్యారావు, ఆ యువతులతో జరిపిన సంభాషణలు ఆలోచనాత్మకంగా ఉంటాయి. తండ్రి: "అబ్బాయీ! నీ చీకటి బ్రతుకులో పెళ్ళామనే పెట్రోమాక్సు లైట్ కావాలి. జీవితం రేడియో సెట్టుకి భర్త ఏరియల్, భార్య ఎర్త్" అంటాడు. "భార్యభర్తలనే ఏరియల్సు, ఎర్తు ఉన్నా ఏకాభిప్రాయమనే విద్యుచ్ఛక్తి లేకపోతే సెట్టు పలకటం సున్నా" అని అంటాడు అబ్బాయి. పాత్రల సంభాషణలు చమత్కారవంతంగా ఉంటాయి. పాత్రల ప్రవేశానికి మధ్య కవి వ్యాఖ్యానం ద్విపదల్లో ఉంది. "ఆర్జించుకొన్నట్టి ఆవేదనాగ్ని బూర్జువా సరదాల బూజు ధరించ" ఇలా కావ్యం మొత్తం మీద 61 ద్విపదలను రాశారు. అది ఆరుద్ర ప్రత్యేకత, జీవఫలం ప్రేమ అనేది ఈ కావ్యసందేశం కొంతమంది అనుకున్నట్లుగా ఈ కావ్యం విషాదాంతం కాదు. "అయ్యా! మృత్యువుగారూ! పిల్లవాణ్ణి దయచేసి కనికరించండి. లేమి కారుతోంది చూడండి. కలల పంచ నుండి కారే సంతృప్తి ధార, నిద్దుర బిందెలలో పట్టుకోనీయండి" అన్న వాక్యాలతో కావ్యం ముగుస్తుంది. ఆరుద్ర 'కూనలమ్మ పదాలు'కు ఎన్నో అనుకరణలు వచ్చాయి. జనం నాలుకల మీద నాట్యమాడేవి చాలా ఉన్నాయి. "ఆశ పెరిగిననాడు, అహం పెరిగినవాడు తనకు తానే కీడు ఓ కూనలమ్మా! బ్రూటుకేసిన ఓటు, బురదలో గిరవాటు, కడకు తెచ్చును చేటు ఓ కూనలమ్మా! సగము క్యాపిటలిస్టు, సగము కమ్యూనిష్టు, ఎందు కొచ్చిన రొష్టు ఓ కూనలమ్మా!" అన్నారు. కవిత్వపరంగా ఇవికాక 'ఆరుద్ర రచన' (కవితలు) 1985 సంకలనం. విశాఖపట్నంపై 1942లో బాంబులు పడినప్పుడు 'మరణశాసనం' కవితలో, "కాలంకాగితమ్మై/ దివాకరుడు స్టాంపయితే/ నా దస్తావేజు మీద/ రేరాజే రాజముద్ర" అంటారు. ఆయన నాట్యశాస్త్రంపై రాసిన 'హస్తలక్షణ పదాలు' విశిష్టమైన రచన. ఇందులో భరత నాట్యంలో ముద్రలకు సంబంధించినవి ఆరుద్ర 31 హస్తలక్షణపదాలను చెప్పారు. వీటిలో ఆరుద్రముద్ర 'బాలగోపాల" అన్నది. నన్నయ్య, విశ్వనాథల మధ్యాక్కరలకంటే భిన్నంగా మంచి గమకంతో ఉండేట్లు మార్పు చేసి రాశారు ఆరుద్ర. వారు సవరించిన విశేషం వారి మాటల్లోనే: "భగణమ్ముపై నొక్క లఘువుపాదుకొలుపును మంచి బిగువు (భలచంద్రగణం)/ నగణమ్ములఘువులను రెండు నడకకై చేర్చుకొననిండు (నలలచంద్రగణం)/ సొగసుగా ఇంద్రగణమందు చొప్పించుకో మాత్ర లైదు/ చిగురించ శుభలక్షణాలు చెప్పరా మధ్యాక్కరాలు" ఇదీ వారి మార్పు. ఇది వారి ప్రయోగం. భార్య రామలక్ష్మి మీద 'కే.రా త్రిశతి' పేరుతో మూడువందల కంద పద్యాలను రాశారు. నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ అయినప్పుడు ఆరుద్ర ఐసియు బెడ్ మీద పడుకొనే వీటిని రాశారు.

'సమగ్రాంధ్ర సాహిత్యం' పుస్తకంలో ఆరుద్ర ప్రత్యేకత వ్యవహార శైలి. అలాగే అన్నమయ్య, త్యాగయ్య, క్షేత్రయ్య వేమనలను చేర్చి సాహిత్య చరిత్ర రాయటం. అంతకుముందు సాహిత్య చరిత్రల్లోకి ఈ కవులు ఎక్కలేదు. ఈ పరిశోధనలో శీర్షికలను చూస్తేనే దీని లోతును ఊహించవచ్చు. 'ఆరుద్ర వ్యాస పీఠం', 'గురజాడ గురుపీఠం', 'రాముడికి సీత ఏమవుతుంది?', 'వేమన్న వేదం'... ఇలా ఆరుద్ర రచనల పట్టికకే పేజీలు పడతాయి. ఆరుద్ర దృశ్య నాటికలలో 'శ్రీకృష్ణదేవ రాయ రూపవాణీ రూపకం'ను గుమ్మడి వగైరా నటులు ప్రదర్శించారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో వరుసగా వందరోజులు ప్రదర్శింపబడింది. ఆరుద్ర కథలు, నాటికలు, నాటకాలు, డిటెక్టివ్ కథలు, డిటెక్టివ్ నవలలు చాలా ఉన్నాయి. 'ఆడదాని భార్య' ఆరుద్ర రాసిన అపురూపమైన డిటెక్టివ్ నవల. ఇక ఆరుద్ర సినిమా పాటలూ వందల సంఖ్యలో ఉన్నాయి.

మొదటిపాట, 'బీదలపాట్లు' (1972) సినిమాలో "ఓ చిలుక రాజా! లయ నీ పెళ్ళెప్పుడయ్యా!" అనేది. ఆరుద్ర రాసిన పెళ్లి పాటలు ఫేమస్. "పందిట్లో పెళ్లవుతున్నాదీ, కనువిందవుతున్నాదీ!", "శ్రీకారం చుట్టుకుంది పెండ్లి పుస్తకం, ఇక ఆకారం దాల్చనుంది కొత్త జీవితం" ఇది చివరిపాట. ఆరుద్రతో వ్యక్తిగతంగా నాకెంతో అనుబంధం ఉంది. ఈ జన్మదినం సందర్భంగా మరోసారి వారిని ఇలా తలచుకుంటూ ఈ అక్షర రూప నివాళి.

## అమెరికాతో ఉద్రిక్తతలు: భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు

అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్న ఇరాన్-అమెరికా వివాదం పరిష్కారానికి భారత్ చొరవ చూపాలని ఇరాన్ నాయకత్వం అభ్యర్థించింది. కిర్గిజ్‌స్థాన్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ తనకున్న దౌత్యపరమైన సంబంధాలను ఉపయోగించాలని ఆయన మోదీని కోరారు. ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ.. కష్టకాలంలో తమకు అండగా నిలుస్తున్నందుకు భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా దౌత్య మార్గాన్ని విడనాడి యుద్ధ మార్గాన్ని ఎంచుకుందని, ఆ దేశంలోని కొన్ని శక్తులు ఈ వివాదం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. చర్చలు, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ఆయన, ఇతర దేశాలు యుద్ధం వైపు వెళ్లకుండా నిరోధించేందుకు భారత్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధానమంత్రి మోదీ స్పందిస్తూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్‌తో భారత్ తన దృఢమైన సంబంధాలను కొనసాగించిందని గుర్తుచేశారు. పెజెష్కియాన్‌ను శాంతికాముకుడిగా అభివర్ణించిన మోదీ, శాంతి స్థాపనలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వెలిగొండపై మాటల యుద్ధం..

ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడం తెలిసిందే.నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో, "ఆ విజువల్స్‌ను దగ్గరగా చూడండి" అంటూ కొన్ని ఫోటోలను పోస్ట్ చేశారు. "2024లో వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు. నీళ్లు లేని ఒక నీటిపారుదల ప్రాజెక్టును ప్రారంభించారు. ఇలాంటి ఫేక్ ప్రారంభోత్సవం వైసీపీకే సాధ్యం!" అని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం 2024 మార్చిలో సొరంగాలు పూర్తి చేసిన సందర్భంగా నీటి ప్రవాహం లేకుండానే ప్రారంభోత్సవం జరిపిందని, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం నిజంగా నీటిని విడుదల చేసిందని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, జగన్ నిన్న ఒక సుదీర్ఘ పోస్ట్‌లో వెలిగొండ ప్రాజెక్టు ఘనత తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డిది, తన ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కీలకమైన సొరంగాల పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేసిందని, టీడీపీ హయాంలో పనులు నెమ్మదిగా సాగాయని విమర్శించారు. ఈ పోస్టుకు కౌంటర్‌గానే లోకేశ్ తాజా విమర్శలు చేశారు. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి, నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. తొలి విడతగా 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు చెందిన సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది.

# కృష్ణమ్మను.. తీసుకొచ్చాం

గిరిజన బిడ్డలు తమ సంప్రదాయ నృత్యాలతో కృష్ణమ్మకు స్వాగతం పలికారు. సభలో, చంద్రబాబు తన కండువాను గాల్లోకి తిప్పుతూ రైతుల ఆనందంలో భాగమయ్యారు. ఈ ప్రాజెక్టు కోసం పరితపించిన దివంగత నేత పూలసుబ్బయ్య కుటుంబ సభ్యులను వేదికపై ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. చంద్రబాబు తమను గౌరవించడం పట్ల పూలసుబ్బయ్య కుమార్తెలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. "నేను ఓట్లు ఆశించి కాదు, మార్పు ఆశించి పనిచేస్తాను. నా ఆలోచన నెక్స్ట్ ఎలక్షన్ కోసం కాదు, నెక్స్ట్ జనరేషన్ కోసం" అని స్పష్టం చేశారు. "ఇప్పుడు మార్కాపురం టైం స్టార్ట్ అయ్యింది. ఈ ప్రాంతం ఇక అన్‌స్టాపబుల్. యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి" అని పిలుపునిచ్చారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులను స్వయంగా పిలిచి శిలాఫలకం వద్ద ఫోటోలు దిగారు. ముఖ్యంగా, వెలిగొండ పనులను పరుగులు పెట్టించిన నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# జగన్ రాకతో వెలిగొండకు గ్రహణం

చంద్రబాబు హయాంలో ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న చర్యలు.. నిర్వాసితుల విషయంలో చంద్రబాబు పెద్ద మనస్సుతో వ్యవహరించారంటూ గత రెండేళ్ల కాలంలో జరిగిన పరిణామాలను మంత్రి వివరించారు. నాడు జగన్ ఇంకా పూర్తిగా తవ్వని సొరంగంలో కార్పెట్ వేసుకుని నడిచి నకిలీ జాతికి అంకితం కార్యక్రమాన్ని చేపట్టారని మండిపడ్డారు. టన్నెళ్లల్లోకి కృష్ణా జలాలను పంపి నిజమైన జాతికి అంకితం కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019లో అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టిందని మంత్రి విమర్శించారు. 2024లో కూటమి రాకతో గ్రహణం వీడిందని తెలిపారు. మార్కాపురం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్ట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మంత్రి ప్రసంగించారు. గొడ్డలి పార్టీ హయాంలో విలువైన ఈ ప్రాజెక్ట్ నిర్మాణ కాలాన్ని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొర చెల్లింపులతో మోసం చేశారని ఆగ్రహించారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల కంటే ఒక్క నెల ముందు ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నట్లుగా జగన్ డ్రామాలు ఆడారని మండిపడ్డారు.

# వెలిగొండపేరుతో మోసం చేసిన జగన్

కులపోదని 2019 ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకున్నామని.. వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశానంటూ ఇక్కడి ప్రజలను మోసం చేశారంటూ విరుచుకుపడ్డారు. మార్కాపురం జిల్లా ప్రజలకు ఇంత మేలు చేసిన చంద్రబాబుకు అండగా నిలుద్దామని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. రూ.4 వేల కోట్ల పనులను పెండింగ్‌లో ఉంచుకుని ఈ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేసిన సిగ్గులేని గొడ్డలి పార్టీని ఏమనాలని ప్రశ్నించారు. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజలను, రైతులను మోసం చేసిన వ్యక్తులను ఏం చేయాలని ్ర÷ర్ అయ్యారు. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పుకుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్ట్ నుంచి నీళ్లు ఎందుకివ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. వారి హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కు పోయిందని.. సొరంగం పనులు పూర్తి కాలేదని చెప్పారు. ఈ సమస్యలను తాము పరిష్కరించి, వెలిగొండ పనులు పూర్తి చేసి ఇప్పుడు నీళ్లు ఇచ్చామని వెల్లడించారు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తులను, మోసం చేసిన వారిని గుర్తించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలని అన్నారు. ఈ ప్రాజెక్ట్ పనులు తామే పూర్తి చేశామని ఆ పార్టీ నేతలు ఇప్పుడు బుకాయిస్తు న్నారని ధ్వజమెత్తారు. ఇంకా రూ.1900 కోట్ల పనులు మిగిలి ఉన్నాయని.. వీటిని పూర్తి చేస్తే మొత్తం వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అవుతుందని స్పష్టం చేశారు.

# దశాబ్దాల కల నెరవేరిన తరుణమిది

వెలిగొండ ప్రాజెక్టు కోసం 7,300 మందికి పైగా తమ ఇళ్లు.. భూములు కోల్పోయి నిర్వాసితులుగా మిగిలారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం రూ.905 కోట్లు విడుదల చేయగా.. ఇప్పటికే రూ.768 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. 1996లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని.. నేడు ఆయన నాయకత్వంలోనే తొలి దశ ప్రారంభం అవుతోందని పవన్ గుర్తుచేశారు. చంద్రబాబు దూరదృష్టి, సంకల్పం కరవు ప్రాంతాల్లో జల సిరులు పారించనుందని పేర్కొన్నారు. మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో జల్ జీవన్ మిషన్?అమరజీవి జలధార కింద చేపడుతున్న మెగా వాటర్ గ్రిడ్ పథకానికి వెలిగొండ ప్రధాన నీటి వనరుగా నిలవనుందని తెలిపారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్ప సాధనలోనూ ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ.. ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేసిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## వెలిగొండ ప్రాజెక్టు వద్ద కృష్ణా నీళ్లను నెత్తిన చల్లుకుని, బాటిళ్లతో పట్టుకెళ్లిన జనం

అది కేవలం నీటి ప్రవాహం కాదు, దశాబ్దాలుగా కరవు నేల చూస్తున్న కల సాకారమైన క్షణం. అందుకే, పరుగులు పెడుతున్న కృష్ణమ్మను చూసి అక్కడికి వచ్చిన జనం కేవలం కేరింతలు కొట్టడమే కాదు, ఆ నీటిని చేతులతో తాకి భక్తితో కళ్లకద్దుకున్నారు. ఎంతో పవిత్రంగా భావిస్తూ తలపై చల్లుకున్నారు. కొందరైతే తాము తెచ్చుకున్న బాటిళ్లలో ఆ పుణ్య జలాలను నింపుకుని ఇళ్లకు పట్టుకెళ్లారు. మార్కాపురం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా కనిపించిన ఈ దృశ్యం, ఆ ప్రాంత ప్రజల గుండెల్లో కృష్ణా జలాలకు ఉన్న స్థానాన్ని, వారి నిరీక్షణ తీవ్రతను చెప్పకనే చెప్పింది. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ప్రారంభించారు. ఫీడర్ కెనాల్ గేట్లు ఎత్తి నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేయడంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా జల సంబరంతో పులకించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ కల కళ్లముందే ప్రవాహమై పరుగులెడుతుంటే, అక్కడికి తరలివచ్చిన రైతులు, మహిళలు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గేట్లు ఎత్తగానే కృష్ణమ్మ పరుగులు పెడుతుంటే, ప్రజల ఈలలు, కేరింతలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. చాలా మంది తమ సెల్‌ఫోన్లలో ఈ అపురూప దృశ్యాన్ని బంధించారు. తమ ప్రాంతానికి నీళ్లు వస్తాయో రావో అనే సందేహంతో బతికిన తాము, ఇప్పుడు కళ్లారా కృష్ణమ్మ పరవళ్లను చూస్తున్నామంటూ పలువురు రైతులు భావోద్వేగానికి గురయ్యారు. తమ జీవితాల్లో ఇదొక చారిత్రక మలుపు అని, తమ కరవు కష్టాలు తీరినట్టేనని ఆనందబాష్పాలతో తెలిపారు. సాధారణంగా సభ ముగియగానే జనం ఇళ్లకు వెళ్లిపోతారు.

# రైతులతో దద్దరిల్లిన నంద్యాల జిల్లా కలెక్టరేట్..





**సాగు, తాగునీరు అందించాలని కోరుతూ నంద్యాలలో వైసీపీ ఆధ్వర్యంలో భారీ "చలో కలెక్టరేట్" ఆందోళన విజయవంతం..**

**మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి నేతృత్వంలో భారీ ప్రదర్శన.**

**శ్రీశైలం జలాశయంలో నీరున్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు విడుదల చేయాలని డిమాండ్.**

**రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేత; 2 లేదా 3 రోజుల్లో నీరు అందిస్తామని కలెక్టర్ హామీ.**

**వర్షాభావ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని, ప్రత్యామ్నాయ మార్గాలు చూపడంలేదని ఆరోపణ.**

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 31 ( నంది పత్రిక )** నంద్యాలలో ఉద్రిక్తత... రైతు కంటతడి... సాగునీరు అందక బీళ్లువారిన పొలాలు! తాగునీటి కోసం అల్లాడుతున్న జనం! ఈ సమస్యలన్నింటిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాలలో కదం తొక్కింది. సాగునీరు, తాగునీరు అందించాలనే డిమాండ్‌తో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన "చలో కలెక్టరేట్" కార్యక్రమం అఖండ స్పందనతో హోరెత్తింది. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి నాయత్వంలో వందలాది మంది రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో నంద్యాల కలెక్టరేట్ ప్రాంగణం జనసందోహంతో దద్దరిల్లింది. "రైతులకు నీరు ఇవ్వాలి... ప్రజలకు తాగునీరు అందించాలి" అంటూ ఎమ్మెల్సీ ఇసాక్ భాషా, మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, వైసీపీ రాష్ట్ర సీఈసీ మెంబర్ పి పి నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి, వైసిపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్స్ రామలింగారెడ్డి, సాయినాథ్ రెడ్డి, రైతులతో కలిసి చేసిన నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. "శ్రీశైలం ప్రాజెక్ట్‌లో నీరు నిల్వ ఉన్నా మన ప్రాంత రైతులకు సాగునీరు ఇవ్వడానికి ఈ కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడంలేదు? చెరువులు, కుంటలు ఎండిపోయి, పంటలు బీళ్లువారుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడంతో, అధికారులే రైతుల కన్నీళ్లను చూసి నీటిని విడుదల చేయాలని కోరుతున్నాం. కలెక్టర్ స్పందించి రెండు, మూడు రోజుల్లో నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. ఒకవేళ ప్రభుత్వం వైఖరిలో మార్పు రాకపోతే మా పోరాటం మరింత ఉద్ధృతం అవుతుందిని శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి హెచ్చరించారు!" ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శశికళ రెడ్డి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, వైసిపి నంద్యాల మండల అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిషా, నంద్యాల జిల్లా కమిటీ సభ్యులు, ఎంపీటీసీలు సర్పంచులు నంద్యాల గోస్పాడు మండలాల రైతులు వైసిపి నాయకులు పాల్గొన్నారు అనంతరం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... వర్షాభావ పరిస్థితుల్లో నీరులేక కరువు తాండవిస్తోందని, అటువంటి పరిస్థితిలో కూటమి ప్రభుత్వంలో ఎటువంటి స్పందన కనిపించలేదని విమర్శించారు. నీటి సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను చూపడంలేదన్నారు. రైతులతో కలసి కలెక్టరేట్ ముట్టడి చేసి, ధర్నా చేసి,రస్తారోకో చేసి అనేక విధాల నిరసనలు హోరెత్తిస్తేనే రైతుల సమస్యలు పరిష్కారం కావడంలేదని, ప్రభుత్వం కళ్లు తెరిచేలా లేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో రైతులకు అన్ని రకాలుగా భరోసాగా నిలిచామన్నారు. శ్రీశైలం ప్రాజెక్టలో నీరు నిల్వ ఉన్నాకూడా మన ప్రాంతంలోని రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడంలేదో చెప్పాలన్నారు. నీరు లేక చెరువులు, కుంటలు ఎండిపోయామని, పంటలు బీళ్లుబారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంతంలో నీరు ఉన్నా మనకు ఆ నీటిని విడుదల చేయలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఇందతా ప్రభుత్వం అసమర్థతను తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వంపై, ప్రభుత్వ పెద్దలపై, మంత్రులపై ఎటువంటి నమ్మకం లేదని కేవలం అధికారులు రైతుల కష్టాలను, కన్నీలను చూసి నీటిని విడుదల చేయాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల్లో అధికారులు పంటలు వేయకండని సూచిస్తున్నారని, అయితే రైతులకు ప్రత్యామ్నాయ భరోసా ఇవ్వడం లేదని, పంటల భీమా అమలు చేయడం లేదని, ఆరుతడి పంటలను సాగు చేయాలని అధికారులు చెబుతున్నారని అయితే వాటికి కూడా కనీసం నీరు అందించలేక పోయారన్నారు. సాగునీరు త్రాగు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో బహిర్గతంగా చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన సాగునీరు, ప్రజలకు త్రాగు నీరు అందించాలని జిల్లా కలెక్టర్కు తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. రెండు లేదా మూడు రోజుల్లో నీరు అందిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. రైతులను ఆదుకొనేందుకు, రైతుల పక్షాన నిలబడతామని, రైతుల గొంతుక అవుతామని తెలిపారు. రైతుల పక్షాన రైతుల కోసం పార్టీలకు అతీతంగా తమ మద్దతు పలుకుతామని స్పష్టంచేశారు. రైతుల కష్టాలను తీర్చేందుకు ఒక రైతు బిడ్డగా జిల్లా కలెక్టర్ స్పందించి నీటిని విడుదల చేస్తుందన్న ఆశతో ఉన్నామన్నారు. ప్రభుత్వం వైఖరిలో మార్పులేకుంటే, ప్రజల సమస్యలు, రైతుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలు ఆగవని, నిరసనలు ఆగవని, మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతులు, యువత, ఉద్యోగులు ప్రతి ఒక్క వర్గం వారు రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారని ఇది ప్రభుత్వం నిర్లక్షవైఖరికి నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణ జరగాలంటే రైతన్నలు పంటలు పండిచాలని, పంటల సాగుకు నీరు అందించాలని కోరారు. రైతులకు అవసరమైన వాటిని అందించలేని ప్రభుత్వం మద్యం మాత్రం డోర్ డెలివరీ చేస్తున్న పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొన్నదని విమర్శించారు.





# ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత...!



## జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా

**కడప, బ్యూరో చీఫ్ ఆగష్టు 31 నంది పత్రిక** : ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత, ప్రజల సంతృప్తికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంలో తగిన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని, వాస్తవ సమాచారంతోనే నివేదికలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రజలు సులభంగా తమ అభిప్రాయాన్ని నమోదు చేసేలా కనిపించే ప్రదేశాల్లో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆదేశించార పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే ప్రజలు తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై తమ అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చని తెలిపారు. ప్రజలు అందించే ప్రతి స్పందన అధికారిక పీజీఆర్ఎస్ వ్యవస్థకు చేరి సేవల మెరుగుదలకు ఉపయోగపడుతుందని, ప్రజల సూచనలు ప్రభుత్వానికి విలువైనవన్నారు. అలాగే ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, శివ రామిరెడ్డి, డీఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, ఎస్ఎస్ఏ ఏపీసీ అనురాధ, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.




## అనంతపురంలో వివాహ వేడుకల పాల్గొన్న టిడిపి జనార్ కోఆర్డినేటర్ రెడ్డప్ప శ్రీనివాస్ రెడ్డి.



**నంది ప్రతినిధి, ఆగస్టు 31, కడప జిల్లా.** జిల్లా టిడిపి అధ్యక్షులు పూల నాగ రాజు కుమారుడు, ఎమ్మెల్యే గుమ్మ నూరు జయరాం వివాహ వేడుకల్లో టిడిపి జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్ప శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## అల్లూరి అనుచరుడు షేక్ గోరి సాహెబ్ చిరస్మరణీయం



**కడప నంది పత్రిక ప్రతినిధి ఆగస్టు 31:** అల్లూరి సీతారామరాజు అనుచరుడిగా రంపా తిరుగుబాటులో పాల్గొన్న షేక్ గోరి సాహెబ్‌కు సంబంధించిన కొత్త చారిత్రక సమాచారం వెలుగులోకి వచ్చిందని కవి, సూక్ష్మ నిర్మాణాల కళాకారుడు షేక్ హాజీ గౌస్ తెలిపారు. పి.ఎస్. శర్మ రచించిన భారత స్వాతంత్ర్య సమరాంగణంలో గోదావరి తీరం పుస్తకంలో ఈ వివరాలు ఉన్నట్లు చరిత్రకారుడు వంగలపూడి శివకృష్ణ వెల్లడించారు. ఈ సమాచారాన్ని పరిశోధకుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ అందించారు. ఈ సందర్భంగా షేక్ హాజీ గౌస్ షేక్ గోరి సాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రచయితలు షేక్ ఇంతియాజుద్దీన్, బి. ఓబుల్ రెడ్డి, బి. లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు




**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛభారత్ కార్మికులుగా పనిచేస్తున్న టువంటి కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సిఐటియు మండల కన్వీనర్ కే దినేష్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయం డిప్యూటీ ఎంపీడీవో కే.పీ శర్మకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం లేస్తే ఇంటింటికి తిరిగి చెత్త సేకరించి గ్రామాల్లో ఉన్న మురుగునంత శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న స్వచ్ఛభారత్ పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా సక్రమంగా వేతనాలు అందించడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. మండలంలో కొన్ని గ్రామాల్లో నెలలు ,ఏండ్లు తరబడి వేతన బకాయిలు ఉన్నాయని వేతనాలు అందక కార్మికుల కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నారని వారి పట్ల కనికరం చూపాల్సినటువంటి అధికారులు ప్రజాప్రతినిధులు వేతనాలు చెల్లించకుండా కఠినంగా వ్యవహరించడం తగదన్నారు. జిల్లా పంచాయతీ అధికారులు స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయి వేతనాలన్నీ పూర్తిగా చెల్లించి రాబోవు ఆరు నెలలకు వేతనాలకు సరిపడా నిధులను అందుబాటులో ఉంచుకోవాలని ఎంపీడీవోలకు, పంచాయతీ కార్యదర్శులకు సర్క్యులర్ జారీ చేశారన్నారు. నిత్యం ప్రజలకు అధికారులకు అందుబాటులో ఉండి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు పూర్తిగా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. స్వచ్ఛభారత్ కార్మికులకు కనీస వేతనం 10000 రూపాయలు ఇవ్వాలని అదేవిధంగా సేఫ్టీ కిట్లు కూడా వెంటనే అందించాలన్నారు ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు శ్రీరాములు రాజారావు సుంకన్న అంకన్న వెంకటేశ్వర్లు వై నాగన్న సుబ్బరాయుడు రవికుమార్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేట్లపల్లె వారి నూతన గృహ ప్రవేశంలో రెడ్యం సోదరులు



**కడప నంది పత్రిక ప్రతినిధి ఆగస్టు 31** మైదుకూరు మండలం పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి నేట్లపల్లె రామాంజనేయులు యాదవ్‌భాగ్యజ్యోతి దంపతుల నూతన గృహ ప్రవేశ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా చైర్మన్ ముత్యాల రాంగోవిందరెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, కేవీసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఊటుకోరు రఘురామిరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, బండి మల్లేశ్వరరెడ్డి, గోవిందు రవిశంకర్‌రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్య అతిథులను నేట్లపల్లె రామాంజనేయులు యాదవ్, ఆదిమూలం శివయ్య యాదవ్, నేట్లపల్లె శివరాం యాదవ్ ఘనంగా సన్మానించారు.

## టీచర్ ఆయా పోస్టులు మాకే ఇవ్వాలి



**కొత్తపల్లి – నంది పత్రిక :** మాదిగ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో టీచర్, ఆయా పోస్టులు మాకే కేటాయించాలని గ్రామస్థులు ఉశెనయ్య, వెంకటరమణ, నాగరత్నం, పక్కిరయ్యలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని సింగరాజు పల్లె గ్రామంలోని మాదిగ కాలనీలో అంగన్వాడీ కేంద్రం వద్ద కాలనీ మహిళలతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మా మాదిగ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో టీచర్, ఆయా పోస్టులను స్థానిక అధికారులు, నాయకులు కుమ్మక్కై మా కెటగిరికి ఇవ్వకుండా మాల కెటగిరికి ఇవ్వడం జరిగిందన్నారు. మా కాలనీలో కూడా చదువుకున్న వారు ఉన్నారని మా దగ్గర ఉన్న అంగన్వాడీ కేంద్రంలో మా వారికే టీచర్ ఆయా పోస్టులు ఇవ్వాలని అన్నారు. మా వాళ్లకు ఇవ్వకుంటే మా పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపించమన్నారు. ఇప్పటికే 15 రోజుల నుంచి పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపడం లేదన్నారు. ఇప్పటికైన అధికారులు, నాయకులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రాముడు, ఆంజనేయులు, స్వామి మూర్తి, కరుణాకర్, నాగేంద్రుడు, చెంచయ్య, సుంకమ్మ, సుజాత, సంధ్య, ఉన్నారు.

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన వక్ఫ్ ట్రిబ్యునల్ సభ్యులు మౌలానా మహమ్మద్ హుస్సేన్ అహ్మద్



**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 31 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ ట్రిబ్యునల్ (ఏపీ స్టేట్ వాక్ఫ్ ట్రిబ్యునల్) సభ్యులుగా మౌలానా మహమ్మద్ హుస్సేన్ అహ్మద్ నియామక ఉత్తర్వులు అందుకున్న సందర్భంగా, నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో (జీవో.ఆర్.టీ.నెంబర్ . 107) ప్రకారం వక్ఫ్ ట్రిబ్యునల్ సభ్యులుగా నియమితులైన మౌలానా మహమ్మద్ హుస్సేన్ అహ్మద్ మంత్రి ఫరూక్ గారికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినందుకు ప్రభుత్వానికి, మంత్రివర్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో మరియు వివాదాల పరిష్కారంలో న్యాయబద్ధంగా వ్యవహరిస్తూ పేద, మైనార్టీ వర్గాల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ సుబ్లి, కర్నూల్ గవర్నమెంట్ కాజీ సలాం మౌలానా, చాబోలు ఇలియాస్, మునియార్ ఖలీల్, మిద్దె హుస్సేన్, అస్మద్దీన్ మరియు పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కొరకు కష్టపడతాం

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మన సుబ్బరాయుడు



**కడప ఆగస్టు 31** భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కొరకు , పార్టీప్రతిష్ట కొరకు కష్టపడి పని చేస్తానని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మన సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల తో అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ఆంధ్రప్రదేశ్ బిజెపి అధ్యక్షుడు మాధవ్ కు ,ఆరోగ్య శాఖ మంత్రి సత్య నాథ్ ,జిల్లా అధ్యక్షుడు జంగటివెంకట సుబ్బారెడ్డి, మీడియా ముఖంగా ధన్యవాదాలు తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం భాగంగా బిజెపి పార్టీని అంచలంచలుగా అభివృద్ధి పరుస్తామని తెలిపారు. ప్రజలలో బలమైన నాయకులను ఎన్నుకొని వారి గెలుపే ధ్యేయంగా మేమంతా కృషి చేస్తామని తెలిపారు. సర్పంచి, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో బీసీలకు కావాల్సిన 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని తెలిపారు. గతంలో బీసీ సీట్లను ముస్లింలకు కేటాయించే వారిని తెలిపారు. భారతీయ జనతా పార్టీ దేశమును ప్రేమించే ప్రతి ఒక్కరికి నచ్చుతుందని తెలిపారు. కూటమిలో భాగంగా బిజెపికి వచ్చే సీట్లను బట్టి ఎవరికి ఏ టికెట్ ఇవ్వాలని రాష్ట్ర అధినాయకత్వం నిర్వహిస్తుందని తెలిపారు. అభ్యర్థులను నిర్ణయించేది రాష్ట్ర నాయకత్వమే అని తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లను మొత్తం వారికే చెందే విధంగా కృషి చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జంగటి వెంకటసుబ్బారెడ్డి,బొమ్మన విజయ్, ప్రవీణ్ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా కృష్ణగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు.పాఠశాలలోని తరగతి గధులతో పాటు విద్యార్థులకు కలిపిస్తున్న మౌలిక వసతులను ఆయన పరిశీలించారు..విద్యార్థుల హాజరు శాతం రిజిస్టర్లను తనిఖీ చేసి బడికి రాని పిల్లల గురించి ఆరా తీశారు..విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఎంపీ పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు విద్య యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు... పదవ తరగతిలో 500 మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు నగదను అందజేస్తానన్నారు...అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంపీ నాగరాజు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు...ఈ సందర్భంగా పాఠశాలలోని పలు సమస్యలను ఉపాధ్యాయులు ఎంపీ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఫోన్‌పే కొత్త ఫీచర్..

ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే ఒక కీలకమైన ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇంటర్నెట్ కనెక్షన్ లేకపోయినా యూపీఐ చెల్లింపులు జరిపేందుకు వీలు కల్పించే 'ఖూ× 123ఖూఖఎ' సేవలను ప్రారంభించింది. ముఖ్యంగా ఇంటర్నెట్ సదుపాయం లేని ఫీచర్ ఫోన్ (బేసిక్ ఫోన్) వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ సేవలను ప్రవేశపెట్టింది.

# బండి ఆత్మకూరులో సిఐటియు ధర్నా



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 31:** పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడిగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపిస్తూ బండి ఆత్మకూరు మండల పారిశుద్ధ కార్మిక సంఘం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. పారిశుధ్య కార్మికులకు నెలల తరబడిగా పెండింగ్ వేతనాలను ఇవ్వకపోవడం వల్ల కుటుంబాలు పూట గడవక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు కొండెక్కి కూర్చోవడంతో అనుభవిస్తున్నారని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. గ్రామాల పరిశుద్ధ విషయంలో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికుల సేవలను గుర్తించి కార్మికులను వెంటనే ఆదుకోవాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, మెడికల్ కిడ్స్ శానిటేషన్ బ్లౌజులు బూట్లు వెంటనే ఇవ్వాలని విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని కోరారు. సమస్యలను త్వరలో పరిష్కరించకపోతే డి ఎల్ పి ఓ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రత్నమయ్య, పారిశుద్ధ కార్మికులు ప్రతాప్ పుల్లయ్య మోజెస్ శేఖర్ ఖాదరయ్య మిఖాయిల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ పద్మావతమ్మకు సమర్పించారు. కార్మికుల వేతనాల చెల్లింపులో చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులతో ఒక సమావేశాన్ని నిర్వహించి జీతాల చెల్లింపు విషయంలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చంద్రమౌళి వివరించారు.

## నేర నియంత్రణ , ప్రజల భద్రతే లక్ష్యం.

### రాత్రి వేళల్లో కొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్ .



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేరాల నియంత్రణకు అనుమానాస్పద వాహనాలను తనిఖీలు చేపడుతున్నారు. అనుమానస్పద వ్యక్తుల వేలిముద్రలను సేకరిస్తున్నారు .కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ లలో విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. కర్నూలు నగరంలో కర్నూల్ త్రీ టౌన్ సీఐ శేషయ్య ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు.బ్లూ కోల్ట్స్ బృందాలు మరియు క్యూఆర్టీ పోలీసు బృందాలు పాల్గొని కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు.డ్రంక్ & డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఎక్కడైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు . అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112 కు లేదా డయల్ 100కు గాని సమాచారం ఇవ్వాలని సూచించారు.

## పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసులను సన్మానించిన ... ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్



**కర్నూలు జిల్లాలో ముగ్గురు పోలీసులు పదవి విరమణ పొందారు వారిలో**

1) ఎ ఎస్సై పి.ఎం. అలీఖాన్ – కర్నూలు ఒకటవ పట్టణ పియస్ .
2) ఎ ఎస్సై హెచ్ .పి. ఫకృద్దీన్ – పత్తికొండ పియస్ .
3) హెడ్ కానిస్టేబుల్ జె. తిరుపాలు – పిసిఆర్ – కర్నూలు . పదవి వీరమణ పొందారు.

**కర్నూల్ సిటీ నంది పత్రిక :** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పదవి వీరమణ పొందిన పోలీసులను శాలువ, పూలమాలతో కర్నూలు ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కర్నూలు ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ మాట్లాడుతూ కుటుంబాలతో సంతోషంగా గడపాలని, పదవివీరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, పదవీ విరమణ పొందిన పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నేపాల్‌కు కే-పాప్ స్టార్ లీ నో భారీ విరాళం

నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న వరద బాధితులను ఆదుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ప్రముఖ దక్షిణ కొరియా పాప్ (కే-పాప్) బ్యాండ్ 'స్ట్రే కిడ్స్' సభ్యుడు లీ నో తన ఉదారతను చాటుకున్నారు. వరద సహాయక చర్యల నిమిత్తం 100 మిలియన్ల కొరియన్ వన్ లు (భారత కరెన్సీలో సుమారు రూ. 69 లక్షలు) విరాళంగా ప్రకటించారు. 'వరల్డ్ విజన్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా లీ నో మాట్లాడుతూ, "ఈ కష్టకాలంలో నేపాల్‌కు నా వంతు సహాయం అందించాలని నిర్ణయించుకున్నాను. ఆ దేశ ప్రజలు ఈ విపత్తు నుంచి వీలైనంత త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## బడి, గుడి పరిసరాల్లో చెత్త కుప్పలు ఉండరాదు.

### కమిషనర్ ఎం.జయకృష్ణ.





**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** నగరంలో పాఠశాలలు, దేవాలయాల పరిసరాల్లో ఎటువంటి చెత్త కుప్పలు ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సిబ్బందికి సూచించారు. సోమవారం ఉదయం నగరంలోని న్యూ మారుతి నగర్, బైరాగిపట్టెడు, కస్తూరిబాయ్ కాలనీల్లోని మస్టర్ రూమ్‌లను కమిషనర్ తనిఖీ చేశారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సమీపంలోని పింక్ టాయిలెట్‌ను తనిఖీ చేశారు. అక్కడ టాయిలెట్ వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలియడంతో, విధులు నిర్వహిస్తున్న మహిళను కమిషనర్ మందలించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రజా సౌకర్యాల నిర్వహణలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం తాతయ్యగుంట గంగమ్మ గుడి, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, ఎంజీఎం స్కూల్, పద్మావతి పార్క్, గాంధీ రోడ్డు, రైల్వే స్టేషన్ సమీపంలోని జీ.వి.పీ.(చెత్తకుప్పలు) పాయింట్లు తదితర ప్రాంతాలను సందర్శించి అక్కడి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. పాఠశాలల వద్ద, ఆలయాల పరిసర ప్రాంతాల్లో ఎటువంటి చెత్త కుప్పలు ఉండకూడదని కమిషనర్ స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కమిషనర్ ఎం.జయకృష్ణ



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సోమవారం ఉదయం తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, భోజన పంపిణీ విధానాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా వంటశాలలోని పాత్రలు, ఆహార పదార్థాల నిల్వ, సిబ్బంది పాటిస్తున్న పరిశుభ్రత ప్రమాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని నిర్వాహకులు, సిబ్బందికి సూచించారు. క్యాంటీన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, వంటశాలలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ నిర్వాహకులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్న క్యాంటీన్ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థకు 29వినతులు.

### కమిషనర్ ఎం.జయకృష్ణ.



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 29 వినతులు వచ్చాయని కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 12 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 17 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. కాగా కొంకా వీధిలో నూతనంగా రోడ్లు ఏర్పాటు చేయాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, ఏమ్మార్పల్లి టిటిడి ప్లాట్స్ లో రోడ్లపై నీరు నిలిచి ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, న్యూ బాలాజీ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని, మారుతీ నగర్ జె ఎస్ కే టవర్స్ ఆరవ అంతస్థులో అక్రమంగా లాడ్జి నిర్వహిస్తున్నారు చర్యలు చేపట్టాలని, కొత్తపల్లి, మస్తాన్ నాయుడు లేఔట్ లో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని, కేకే లేఔట్ కు వచ్చే చెత్త బండికి స్పీకర్ లేకపోవడంతో ఎప్పుడు వస్తుందో తెలియడం లేదని, జీవకోనలో కాలువపై జి ప్లస్ 2నిర్మాణం చేస్తున్నారు చర్యలు తీసుకోవాలని, న్యూ మారుతీ నగర్లో చెత్త తొలగించడం లేదని, శ్రీనివాసపురంలో మాకు ఇంటి పక్కన స్క్రాప్ గోడౌన్ ఉండడం వలన పాములు, ఎలుకలు వస్తున్నాయి చర్యలు చేపట్టాలని, ఆదిత్య టవర్స్ వద్ద ఎక్కువ వాహనాలు నిలపడంతో ఇబ్బందిగా ఉందని, శివజ్యోతి నగర్ యుజీడీ సమస్య పరిష్కరించాలని కోరారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను ఆయా విభాగాల అధికారులకు పంపి చర్యలు చేపడతామని కమిషనర్ తెలుపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శారదా దేవి, మేనేజర్ హాసీమ్, సర్వేయర్ గురువారెడ్డి, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### అనుమతులు లేకుండా 'చలో తెలుగు గంగ' నిర్వహిస్తే చర్యలు

### ట్రాక్టర్ యజమానులు, నాయకులకు ముందస్తు నోటీసులు

### : ఎస్సై బి. సురేష్

**వెలుగోడు ఆగస్టు 31 నంది పత్రిక:** రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న 'చలో తెలుగు గంగ' కార్యక్రమానికి ఎలాంటి అనుమతులు లేవని వెలుగోడు మండల ఎస్సై బి. సురేష్ తెలిపారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించి చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సోమవారం వెలుగోడులో విలేకరులతో మాట్లాడిన ఎస్సై ఈ మేరకు వివరాలు వెల్లడించారు.వైసీపీ ఆధ్వర్యంలో సుమారు 500 ట్రాక్టర్లతో రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ తెలుగు గంగ ప్రాజెక్టును ముట్టడించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం ఉందన్నారు. అయితే ఈ కార్యక్రమానికి పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించడం, ప్రాజెక్టు వద్దకు వెళ్లి ముట్టడికి ప్రయత్నించడం, ప్రజలకు మరియు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.ప్రస్తుతం మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని ఎస్సై తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కార్యక్రమానికి సంబంధించిన నాయకులు, ట్రాక్టర్ యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. నోటీసులు అందుకున్న వారు పోలీసుల సూచనలు, చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో కార్యక్రమాలు నిర్వహించడంపై తమకు అభ్యంతరం లేదని, అయితే ప్రజల భద్రతకు భంగం కలిగేలా, అనుమతులు లేకుండా భారీ ర్యాలీలు, ముట్టడి కార్యక్రమాలు నిర్వహించడాన్ని అనుమతించబోమని ఎస్సై పేర్కొన్నారు. ముఖ్యంగా వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఒకేసారి రోడ్లపైకి వస్తే ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని, అత్యవసర వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందన్నారు.తెలుగు గంగ ప్రాజెక్టు పరిధిలోకి అనుమతులు లేకుండా ప్రవేశించడం, అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం లేదా ఇతర చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ పరిస్థితిని అర్థం చేసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.ముందస్తు నోటీసులు ఇచ్చినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి కార్యక్రమంలో పాల్గొంటే బాధ్యులపై చర్యలు తప్పవని ఎస్సై బి. సురేష్ స్పష్టం చేశారు. ట్రాక్టర్ యజమానులు తమ వాహనాలను అనుమతి లేని ర్యాలీలకు తీసుకెళ్లకుండా



జాగ్రత్త వహించాలని సూచించారు. అలాగే వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా శాంతియుతంగా వ్యవహరించాలని కోరారు.మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనూ ఉపేక్షించబోమని ఎస్సై తెలిపారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, అనుమతులు లేకుండా నిర్వహించే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన బాధ్యత అని, అందులో భాగంగానే ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతులకు సాగునీరు అందించాలనే డిమాండ్‌పై రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అయితే చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఎస్సై సూచించారు. నిబంధనలు అతిక్రమించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మరోసారి హెచ్చరించారు.

# నగరానికి న్యూ లుక్ తీసుకొద్దాం

**కూడళ్ల అభివృద్ధి, సుందరీకరణ,**

**పచ్చదనం పెంపునకు ప్రత్యేక ప్రణాళికలు**

**ప్రధాన కూడళ్లలో టర్ఫ్ గడ్డి, వాటర్ ఫౌంటెన్ల అభివృద్ధి**

**డివైడర్లు, నడకబాటలకు సరికొత్త రూపు**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని కూడళ్లను అభివృద్ధి చేసి, సుందరీకరణ, పచ్చదనం పెంపు పనులను చేపట్టి నగరానికి న్యూ లుక్ తీసుకొద్దామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. సోమవారం ఆయన కోట్ల విజయభాస్కరరెడ్డి, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్, మౌర్య ఇన్ తదితర కూడళ్లు, డివైడర్లను కమిషనర్, ఇంజనీరింగ్, హార్టికల్చర్ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు.ఆయా కూడళ్లలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పచ్చదనం పెంపునకు ఉన్న అవకాశాలను కమిషనర్ పరిశీలించారు. నగరంలోని 9 ప్రధాన కూడళ్లన అభివృద్ధి చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కూడళ్లలో టర్ఫ్ గడ్డి ఏర్పాటు చేయడంతో పాటు, ఇప్పటికే ఉన్న వాటర్ ఫౌంటెన్లను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న డివైడర్లకు ఆకర్షణీయమైన రంగులు వేయడం, అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేపట్టడం, నడకబాటలను అభివృద్ధి చేయడం వంటి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. రహదారుల వెంట పచ్చదనం మరింత పెరిగేలా మొక్కలు నాటడంతో



పాటు, ఇప్పటికే ఉన్న మొక్కలను సంరక్షించాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు.నగరానికి ప్రధాన ప్రవేశ మార్గాలుగా, ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రాంతాలుగా కూడళ్లు ఉంటాయని కమిషనర్ పేర్కొన్నారు. అందువల్ల ప్రతి కూడలిని ప్రత్యేకంగా తీర్చిదిద్దేలా డిజైన్ రూపొందించాలన్నారు. గోడలపై ఆహ్లాదకరమైన చిత్రాలు, పచ్చదనం, ఆకర్షణీయమైన ల్యాండ్‌స్కేపింగ్ వంటి అంశాలను సమన్వయం చేసి నగరానికి సరికొత్త రూపాన్ని తీసుకురావాలని తెలిపారు.కూడళ్ల అభివృద్ధి, సుందరీకరణ పనులు నాణ్యతతో చేపట్టడంతో పాటు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చగా, సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, హార్టికల్చర్ ఏడి ప్రతాప్ రెడ్డి, డీఈఈ కృష్ణలత, తదితరులు పాల్గొన్నారు.

# సుందరీకరణకు తూట్లు.. ప్రకటనదారులకు షాక్

**రాజ్ విహార్‌లో పోస్టర్లు అతికించిన వారిపై**

**కమిషనర్ చల్లా ఓబులేసు ఆగ్రహం**

**పోస్టర్లు తొలగించి, బాధ్యులను గుర్తించి**

**జరిమానా విధించాలని ఆదేశం**

**పోస్టర్ల సంస్కృతికి చెక్ పెట్టకపోతే కొరడా**

**ఝుళిపిస్తామని హెచ్చరిక**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగర సుందరీకరణ పనులను పాడు చేస్తూ బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు అతికించడంపై నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాజ్ విహార్ ప్రాంతంలో పర్యటించిన ఆయన సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చేసిన ప్రాంతాల్లో పోస్టర్లు అతికించడాన్ని



గమనించి, వాటిని వెంటనే తొలగింపజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని ప్రధాన కూడళ్లు, డివైడర్లు, గోడలు, స్తంభాలు తదితర ప్రాంతాలను లక్షలాది రూపాయల ప్రజాధనంతో సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అయితే కొందరు ప్రకటనదారులు, సంస్థలు నిబంధనలను ఉల్లంఘించి పోస్టర్లు అతికించడం ద్వారా నగర సౌందర్యాన్ని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజ్ విహార్ ప్రాంతంలో పోస్టర్లు అతికించిన వారిని గుర్తించి, వారికి హెచ్చరికలు జారీ చేయడంతో పాటు నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. నగర సుందరీకరణ పనులను పాడు చేసే విధంగా ఎక్కడైనా పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే వాటిని వెంటనే తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రకటనల కోసం అనుమతించిన ప్రాంతాలను మాత్రమే వినియోగించాలని, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా పోస్టర్లు అతికించడం, బ్యానర్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలకు స్వస్తి పలకాలని కమిషనర్ సూచించారు. నగర సుందరీకరణను కాపాడేందుకు ప్రజలు, వ్యాపార సంస్థలు, ప్రకటనదారులు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.నగరంలో "పోస్టర్ల సంస్కృతికి చెక్" పెట్టేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించిన కమిషనర్.. నిబంధనలు ఉల్లంఘించి నగర సౌందర్యానికి భంగం కలిగించే వారిపై ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సమస్యల పరిష్కారంలో వేగం అవసరం

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**'ప్రజా ఫిర్యాదుల' స్వీకరణకు 9 అర్జీలు**

**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగర ప్రజల నుంచి వివిధ రూపాల్లో అందుతున్న అర్జీల పరిష్కారంలో జాప్యం తగదని, మరింత వేగవంతం అవసరమని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులకు సూచించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య ప్రాంతాన్ని సందర్శించినప్పుడు సమస్యను పూర్తిగా గ్రహించి, పరిష్కారం కనుగొనడం సులభమవుతుందన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోపు శాశ్వతంగా పరిష్కరించి, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచుదామని కమిషనర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 9 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ జునైద్, ఎస్ఈ రమణమూర్తి, కార్యదర్శి నాగరాజు, డిసిపి శబ్నం శాస్త్రీ, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, ఏసిపి నాగరాజు, ఆర్వోలు వాజిద్, క్రిస్టోఫర్ బాబు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, పాల్గొన్నారు.



## విద్యాభివృద్ధికి కూటమి పెద్ద పీట

## కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు




**కర్నూల్ సిటీ నంది పత్రిక** విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు..కృష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతి బా పూలే బీ.సీ బాలుర గురుకుల పాఠశాలను పత్తికొండ ఎం.ఎల్.ఏ కే.ఈ శ్యామ్ కుమార్ తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేష్ లు విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయులు పోస్టులను భర్తీ చేసిందన్నారు.. ఇక రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంపీ తెలిపారు.



## రాజు.. 'వెరీ గుడ్'

**వినూత్న ఆలోచనతో చెత్త సేకరణ**

**పారిశుద్ధ్య కార్మికుడుని అభినందించిన కమిషనర్ చల్లా ఓబులేసు**

**స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో బెస్ట్ వర్కర్‌గా ఎంపికకు ప్రతిపాదనలు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని 5వ సానిటేషన్ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు రాజు వినూత్న ఆలోచనతో చెత్త సేకరణను సులభతరం చేసుకోవడంపై నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అభినందించారు. సోమవారం రివర్‌వ్యూ కాలనీలో చెత్త సేకరిస్తున్న రాజును గమనించిన కమిషనర్.. "వెరీ గుడ్ రాజు" అంటూ ప్రశంసించారు.రివర్‌వ్యూ కాలనీ, కె.ఈ. మాదన్న నగర్, ఆనంద్ టాకీస్ లైన్ ప్రాంతాల్లో ప్రతిరోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరించే రాజు.. చెత్త సేకరణలో సమయాన్ని ఆదా చేయడంతో పాటు, ఎక్కువ మొత్తంలో చెత్తను ఒకేసారి తరలించేందుకు తన ద్విచక్ర వాహనానికి ప్రత్యేకంగా ట్రాలీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ ట్రాలీలో నాలుగు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకుని, తడి, పొడి తదితర వ్యర్థాలను సేకరిస్తున్నారు. దీంతో చెత్త సేకరణ ప్రక్రియ మరింత వేగంగా, సులభంగా కొనసాగుతోంది. విధుల్లో భాగంగా సొంత ఆలోచనతో వినూత్నంగా ట్రాలీని రూపొందించుకుని పారిశుద్ధ్య కార్యక్రమాలకు మరింత సమర్థవంతంగా సహకరిస్తున్న రాజు పనితీరును కమిషనర్ చల్లా ఓబులేసు అభినందించారు. ఇతర పారిశుద్ధ్య కార్మికులకు కూడా రాజు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాజును బెస్ట్ వర్కర్‌గా ఎంపిక చేసేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సానిటరీ ఇంస్పెక్టర్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ వీరభద్ర ప్లెక్స్ అండ్ ప్రింటింగ్ షాప్ ప్రారంభించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి.

**వెలుగోడు, ఆగస్టు 31 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన "లక్ష్మీ వీరభద్ర ఫ్లెక్స్ అండ్ ప్రింటింగ్" షాప్‌ను శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) బుడ్డా రాజశేఖర్ రెడ్డి సోమవారం ఘనంగా ప్రారంభించారు. షాప్ నిర్వాహకుల ఆహ్వానం మేరకు విచ్చేసిన ఎమ్మెల్యే, రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలనతో షాప్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... వెలుగోడు పట్టణ ప్రజలకు, వ్యాపారులకు మరియు సమీప గ్రామాల వారికి నాణ్యమైన ప్రింటింగ్ సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు.



వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ, వ్యాపారపరంగా ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఈ సందర్భంగా షాప్ నిర్వాహకులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

**అత్యాధునిక ప్రింటింగ్ సేవలు అందుబాటులో...** ఈ షాప్‌లో ఆకర్షణీయమైన ఫ్లెక్స్ బ్యానర్లు, బ్యాక్ లైట్ బోర్డులు, ఎల్ఈడీ బోర్డులు, స్టాండ్ బోర్డులు మరియు వినైల్ స్టిక్కర్లు తదితర ప్రింటింగ్ పనులన్నీ అత్యాధునిక సాంకేతికతతో, అత్యంత నాణ్యంగా తయారు చేసి ఇవ్వబడునని షాప్ నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్, ముజిబ్, జూటూరు మాజీ సర్పంచ్ చంద్ర, మహేష్‌లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు, షాప్ నిర్వాహకులు, మిత్రులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను విజయవంతం చేద్దాం

**కర్నూల్ నంద్యాల జిల్లాల కోఆర్డినేటర్ చింతా సురేష్ బాబు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** 02-09-2026 తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నామని జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు బిర్లా కాంపౌండ్ జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన జనసేన నాయకుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2వ తేదీ ఉదయం బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం మెగాసిరి ఫంక్షన్ హాల్ లో పవన్ కళ్యాణ్ జన్మదిన కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని అదే రోజు ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ రాష్ట్ర యువజన విభాగాన్ని ప్రారంభించనున్నారని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించేందుకు నంద్యాల చెక్పోస్ట్ సమీపాన మెగాసిరి ఫంక్షన్ హాల్ లో స్క్రీన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు ప్రతి ఒక్క కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**గ్రామపంచాయతీ నూతన భవనమునకు భూమి పూజ చేసిన చాగి మల్లికార్జున రెడ్డి**



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని మండలం చాగి గ్రామమునందు గ్రామపంచాయతీ నూతన భవనముకు భూమి పూజ కార్యక్రమమునకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు చాగి.మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు,గ్రామస్తులతో పాటుగా భవన నిర్మాణ కొరకు కేటాయించిన స్థలంలో భూమి పూజ చేసి మార్కింగ్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం ఉద్దేశించి మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడినటువంటి మన గ్రామ పంచాయతీ గత వైఎస్ఆర్సిపి పాలనలో 5 సంవత్సరాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోక మరుగున పడినటువంటి గ్రామం ఏదైనా ఉందంటే మన చాగి గ్రామపంచాయతీ అని ఉన్నారు. 2024 లో మన కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామ అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ నాయకులు సుమారు 30 లక్షలతో ఎస్సీ కాలనీ నందు సిసి రోడ్లు డ్రైనేజీలు వేయడం జరిగింది. ఇంకా మిగిలినటువంటి వర్క్స్,కాలువలు,రోడ్ల, అభివృద్ధి పనుల గురించి పలమార్లు గ్రామ సభలు ద్వారా ఎస్టిమేంట్ నివేదికలు పై అధికారులకు పంపడం జరిగిందని, ఇందులో భాగంగానే నూతన పంచాయతీ భవనానికి గాను సుమారు 38 లక్షల రూపాయలు గ్రాంట్ తో ఈరోజు భవన నిర్మాణనికి భూమి పూజ చేసి మార్కింగ్ ఇవ్వడం జరిగింది, త్వరలోనే మన గ్రామస్తుల సేవలకై అంకితం చేస్తామని గ్రామ నాయకులు అన్నారు. రేపు రాబోయే స్థానిక ఎన్నికల్లో మన తెలుగుదేశం పార్టీ నాయకులకు పట్టం కడితే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపిస్తామని అన్నారు. కార్యక్రమంలో చాగి తెలుగుదేశం పార్టీ నాయకులు కే.రాము,గూళెప్ప,ఎర్రిస్వామి, కుమ్మరి.మల్లప్ప,మల్లికార్జున గౌడ్ ఆదోని.బసవరాజు, మల్లారెడ్డి,ఆకుల.వెంకటేష్,స్వామి, రాజు ఇతర గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

**కర్నూలు మహిళా పియస్ డిఎస్పీ ఉపేంద్రబాబు**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 99 ఫిర్యాదులు.**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు మహిళా పియస్ డిఎస్పీ ఉపేంద్రబాబు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 99 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...** 1) నేను డిగ్రీ పూర్తి చేశాను, విశ్వనాథ్ అనే వ్యక్తి విఆర్వో ఉద్యోగం ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పి రూ. 4 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు, అశోక్ నగర్ చెందిన మనోజ్ కుమార్ ఫిర్యాదు చేశారు.

2) నా కుమారులు అన్నం పెట్టకుండా బయటకు గెంటివేస్తున్నారని, కర్నూలు మండలం, జి. శింగవరం గ్రామానికి చెందిన అయ్యమ్మ ఫిర్యాదు చేశారు.

3) ఉరుకుందలో మా పొలం ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదోనికి చెందిన చల్లా పాండురంగ, చల్లా శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు.

4) చిన్న కుమారుడు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు, నాగేంద్రనగర్ కు చెందిన శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు మహిళా పియస్ డిఎస్పీ ఉపేంద్రబాబు హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు మహిళా పియస్ డిఎస్పీ తో పాటు సీఐలు రామయ్యనాయుడు, గుణశేఖర్ బాబు పాల్గొన్నారు.

# పరిశ్రమల అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దు..!

**జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమీక్ష సమావేశంలో డిఆర్వో మల్లికార్జునుడు**



**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 31: నంది పత్రిక** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, అనుమతుల విషయంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకూడదని జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డి ఐ ఈ పి సి) సమావేశం డీఆర్వో మల్లికార్జునుడు ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చీఫ్ చిన్నారావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిఆర్వో మల్లికార్జునుడు మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమలకు మంజూరయ్యే అనుమతులపై సమావేశంలో సమీక్షించారు. జిల్లాలో మొత్తం 11,905 దరఖాస్తులు అందగా, 11,774 దరఖాస్తులకు అనుమతులు మంజూరైనట్లు అధికారులు వివరించారు. మరో 36 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో కాలుష్య నియంత్రణ మండలికి సంబంధించిన 20, కర్మాగారాల శాఖకు సంబంధించిన 16 దరఖాస్తులు ఉన్నట్లు తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను కూడా వేగంగా పరిష్కరించాలని సూచించారు.చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై కూడా సమావేశంలో చర్చించారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రవాణా వాహనాల కొనుగోలుకు సంబంధించిన మూలధన పెట్టుబడి రాయితీలు, సాధారణ పారిశ్రామికవేత్తలకు విద్యుత్ వ్యయాల రీయింబర్స్‌మెంట్, వడ్డీ రాయితీల మంజూరుపై ప్రతిపాదనలను పరిశీలించారు. జిల్లాలో ఇప్పటికే ఆమోదం పొందిన భారీ పరిశ్రమల పురోగతిపైనా సమావేశంలో సమీక్ష జరిగింది. కొప్పర్తిలో శ్రీ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ సంస్థ రూ.4,914 కోట్ల పెట్టుబడితో 5,000 మందికి ఉపాధి కల్పించే ప్రాజెక్టు అమలు చేస్తోందన్నారు. జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు రూ.8,800 కోట్ల పెట్టుబడి, 800 ఉద్యోగాల లక్ష్యం కాగా డాల్మియా సిమెంట్ విస్తరణ ప్రాజెక్టు, శ్రీసిమెంట్ తదితర ప్రాజెక్టుల పురోగతిని కూడా సమీక్షించారు.జిల్లాలో పునరుత్పాదక ఇంధన రంగంలో అమలవుతున్న, ప్రతిపాదిత ప్రాజెక్టులపై అధికారులు వివరాలు అందించారు. సౌర విద్యుత్ ప్రాజెక్టులు, పవన విద్యుత్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ ప్రాజెక్టుల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. జిల్లాలో ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల సామర్థ్యం మొత్తం 15,150 మెగావాట్లుగా ఉన్నట్లు అజెండాలో పేర్కొన్నారు.ఏపీఐఐసీ పరిధిలో పారిశ్రామిక భూముల కేటాయింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 48 దరఖాస్తులపై సమావేశంలో చర్చించారు. కొప్పర్తి, కొప్పర్తి ఎంఎస్ఎంఈ పార్క్, మెగా ఇండస్ట్రియల్ హబ్, చౌడూరు ఎంఎస్ఎంఈ పార్క్ తదితర ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. పారిశ్రామికవేత్తలకు అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు, జిల్లాకు పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకురావడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని డీఆర్వో మల్లికార్జునుడు సూచించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం జనార్దనం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక శాఖ, డిటిఓ, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఐఐసీ, టూరిజం, బ్యాంకర్లు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగికి పదవీ విరమణ సహజం

**పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం**



**బనగానపల్లె ఆగష్టు 31నంది పత్రిక** బనగానపల్లె పట్టణం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలు రమాదేవి సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్బంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆమె తోటి ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాళ్లు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు మాట్లాడుతూ రమాదేవి నిబద్ధత,క్రమశిక్షణ తో పాఠశాల లో పని చేశారని కొనియాడారు.మాజీ ప్రధానోపాధ్యాయులు బాలగంగాధర రెడ్డి మాట్లాడుతూ పాఠశాల లో సంవత్సరానికి 1,2 రోజులు మాత్రమే సెలవు పెడుతూ బోధన కు ఎక్కువ సమయం కేటాయించే వారు అని తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు వ్యక్తులు మేడం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు అనంతరం పాఠ శాల ఉపాధ్యాయిని, ఉపాద్యాయులచే ఉపాధ్యాయురాలు రమాదేవి ని ఘనంగా సత్కరించారు.ఈ కార్య క్రమంలో బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి,పి ఆర్ టి యు నాయకులు రాంపుల్లా రెడ్డి,ప్రభాకర రెడ్డి,దస్తగిరి, రామచంద్ర రెడ్డి ,ఇతర పాఠ శాల ఉపాధ్యాయిని ఉపాద్యాయులు,రమాదేవి బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలి

**జిల్లా క్రైసిస్ కమిటీ సమావేశంలో.. జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు**



**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని, కార్మికుల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో .. జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు అధ్యక్షతన జిల్లా క్రైసిస్ గ్రూప్ కమిటీ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులైన అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించేలా అవసరమైన భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రత్యేకంగా రెడ్ కేటగిరీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమల్లో భద్రతా ఏర్పాట్లు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం, కార్మికుల రక్షణ చర్యలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని డీఆర్వో మల్లికార్జునుడు హెచ్చరించారు. క్రైసిస్ గ్రూప్ సభ్యులు అప్రమత్తంగా ఉండటంతో పాటు పరిశ్రమల భద్రతపై తరచుగా సమీక్షలు నిర్వహించాలని సూచించారు.రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో పరిశ్రమల్లో తరచుగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, ప్రమాదం సంభవించినప్పుడు చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై కార్మికులు, పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా సంబంధిత శాఖలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.ముందుగా రెడ్ కేటగిరీ పరిశ్రమల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, భద్రతా ప్రమాణాల అమలు, లోపాలు, తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీఆర్వో అధికారులను ఆదేశిం చారు. సమావేశంలో ఫ్యాక్టరీస్ శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, రవాణా శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, ఏపీఎస్పీడీసీఎల్, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, ఆర్టీపీపీ, అగ్నిమాపక శాఖ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## దద్దనాల ప్రాజెక్టుకు జుర్రేరు ఎత్తిపోతల ద్వారా ఎస్ ఆర్ బి సి నీరు

**బనగానపల్లె ఆగష్టు 31నందిపత్రిక** బనగానపల్లె పట్టణంలోని ఎస్సార్ బీసీ కాలువ నుండి దద్దనాల ప్రాజెక్టుకు జుర్రేరు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. సోమవారం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండు నడిపి భూషన్న,యాగంటి దేవస్థానం చైర్మన్ బండి మౌలీశ్వర రెడ్డి లు, బత్తుల నారాయణ రెడ్డి, సంగు సంకేశ్వర రెడ్డి లు నీటిని ఎత్తిపొసే మోటార్లను ఆన్ చేశారు. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఆర్బిసి కాలువ నుండి ఎత్తిపోతల పథకం మోటార్లను ఆన్ చేసి దద్దనాల ప్రాజెక్టు లోనికి నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి ఎస్ఆర్బిసి కాల్వకు నీటిని విడుదల చేయించారని తెలిపారు.ఎస్ఆర్బిసి కాలువకు నీరు రావడంతో దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు పడమటి పల్లెల్లో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని దద్దనాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తే 2000 ఎకరాలకు సాగునీరు 15 గ్రామాలకు త్రాగునీటి సమస్య తీరుతుందన్నారు ఎస్ఆర్బి సి కాలువకు నీటిని విడుదల చేయించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎర్రగుడి భాస్కర్ రెడ్డి,గోపినాథ్,జయ నాయక్,కాంతు రెడ్డి,ప్రసన్న కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



## మాదిగ ఇనాం భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

**తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు**

**పోరుమామిళ్ల, ఆగస్టు 31 (నంది పత్రిక)** మండలంలోని అక్కలరెడ్డిపల్లె గ్రామంలో మాదిగలకు చెందిన ఇనాం భూమిని కొందరు ఇతరులు ఆక్రమించారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన మాదిగలు సోమవారం గ్రీవెన్స్‌లో పోరుమామిళ్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల మండల ఎమ్మార్పీఎస్ నాయకులు దాసరపల్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. అక్కలరెడ్డిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 1326ఈ, 1326దీలో సుమారు 7 ఎకరాల 30 సెంట్ల మాదిగ ఇనాం భూమి ఉందన్నారు. నిరక్షరాసులైన మాదిగలకు సమాచారం లేకుండా కొందరి పేర్లపై భూములను నమోదు చేశారని ఆరోపించారు.ఎస్సీలకు చెందిన భూములను ఎస్సీలకు కాకుండా ఇతరుల పేర్లపై ఆన్‌లైన్ చేయడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. అర్హులైన మాదిగలకు న్యాయం జరిగేలా ఇనాం భూమిపై సమగ్ర విచారణ జరిపి, భూమిని మాదిగలకే చెందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాదిగలకు న్యాయం జరగని పక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని కిరణ్ కుమార్ హెచ్చరించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్.. భూమికి సంబంధించిన వివరాలను పరిశీలించి, ఇరువర్గాల సమక్షంలో సెప్టెంబర్ 9న ఆధారాల ఆధారంగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాగిపోగు బాలు మాదిగ, లక్కినేని బాబు మాదిగతో పాటు అక్కలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మోహన్, ఆరోగ్యం, గురయ్య, సుబ్బరాయుడు, సునీల్, మధు, తదితరులు పాల్గొన్నారు.



# వెలుగోడు రిజర్వాయర్ ముట్టడికి భగ్నం చేసే యత్నాలు


**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 31 :** వెలుగోడు రిజర్వాయర్ ను 500 ట్రాక్టర్లతో సెప్టెంబర్ 1న ముట్టడి చేస్తామని శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు శిల్పా చక్రపాణి రెడ్డి ప్రకటించిన మేరకు, రిజర్వాయర్ ముట్టడికి భగ్నం చేసే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. శ్రీశైలం జలాశయంలో సమృద్ధిగా నీళ్లు ఉన్నప్పటికీ, వెలుగోడు రిజర్వాయర్ లో ఆశించిన స్థాయిలో నీరు ఉన్నప్పటికీ తాగునీరు సాగునీరు విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తూ ఉందని చక్రపాణి రెడ్డి గత కొన్ని రోజులుగా ఆరోపిస్తూ ఉన్నారు. పది రోజుల క్రితమే శ్రీశైలం నియోజకవర్గం లోని వెలుగోడు ఆత్మకూరు బండి ఆత్మకూరు మహానంది మండలాల్లో పర్యటించారు. ఖరీఫ్ సీజన్లో రైతులు వరిమళ్లు వేసి 40 రోజులు పైబడుతున్నప్పటికీ తెలుగు గంగ, కేసీ కాలువలకు నీరు వదలడం లేదని, ఈ కారణంగా పొలాలు బీటలు బారిపోయి, ఎండిపోయే దశకు చేరుకున్నాయని పంట పొలాలను పరిశీలించి గుర్తించారు. నీటి విడుదల విషయంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ, రిజర్వాయర్ ముట్టడికి రైతులు సంసిద్ధం కావాలని చక్రపాణి రెడ్డి పిలుపునిచ్చారు. రైతులు వేలాదిగా వెలుగోడు రిజర్వాయర్ ముట్టడికి ట్రాక్టర్ల ద్వారా తరలివచ్చి తమ నిరసన గలాన్ని వినిపించాలని కూడా పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో రిజర్వాయర్ ముట్టడి ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పోలీసు శాఖకు ప్రభుత్వం ఆదేశించినట్లుగా తెలుస్తుంది. ఈ మేరకు గత రెండు రోజుల నుండి ఆత్మకూరు వెలుగోడు బండి ఆత్మకూరు మహానంది మండలాలకు చెందిన ట్రాక్టర్ యజమానులకు పోలీసులు నోటీసులు ఇచ్చే పనిలో మునిగితేలుతున్నారు. రిజర్వాయర్ ముట్టడికి ముందస్తు అనుమతులు లేవు కాబట్టి, ముట్టడి ప్రయత్నాన్ని విరమించుకోవాలని లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాక్టర్ యజమానులకు ఇచ్చిన నోటీసులలో పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల నోటీసులతో ట్రాక్టర్ యజమానులు ఆందోళనలో పడ్డారు. ఈ విషయం మాజీ ఎమ్మెల్యే చక్రపాణి దృష్టికి రావడంతో పోలీసుల వైఖరిని తప్పుపడుతున్నారు. పోలీసులు ట్రాక్టర్లను అడ్డుకుంటే, ఆటోల ద్వారా రావాలని వాటిని కూడా అడ్డుకుంటే మోటార్ సైకిళ్లపై రావాలని, లేనిపక్షంలో పాదయాత్రగా నైనా రైతులు తరలిరావాలని సోమవారం నంద్యాలలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో చక్రపాణి రెడ్డి ప్రకటించారు. వీటన్నిటికీ పోలీసులు అడ్డు చెబితే, గ్రామాలలో వంట వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలపాలని కూడా ప్రకటించారు. రైతులు ఇప్పటికే వరి సాగు కోసం వేల రూపాయలను ఖర్చు పెట్టడం జరిగిందని, రైతులు వేసుకున్న పంటలు చావు బతుకుల ముందు కొట్టుమిట్టాడుతున్న వ్యక్తిలా ఉన్నాయని, చనిపోయే వాడి నోట్లో తులసి నీళ్లు పోయమన్నట్లుగా, ఎండిపోతున్న పంటలకు సాగునీరు వదిలి జీవం పోయాలని అభ్యర్థిస్తున్నామని చక్రపాణి రెడ్డి ప్రకటించడం జరిగింది. రైతులు వెలుగోడు రిజర్వాయర్ ను ముట్టడి చేయకుండా ఉండేందుకు పోలీసు శాఖ ప్రయత్నాలు చేస్తూ ఉంది. ప్రధాన రహదారులలో పోలీసు బందోబస్తు నిర్వహించి, రైతుల ముట్టడి యత్నానికి అడ్డుకట్ట వేయాలని చర్యలు చేపట్టడంలో తల మునకలు అవుతూ ఉన్నారు. ప్రధాన రహదారులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి రైతులు రిజర్వాయర్ వద్దకు వెళ్లకుండా ఆపాలనే ప్రయత్నాలు చేస్తున్నారు.

## అంతా ఎల్నినో ప్రభావమే

ఎల్లినో ప్రభావం కారణంగా ఆశించిన స్థాయిలో ఈ ఏడాది వర్షాలు కురియకపోవడంతో ఎన్నడు లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్లో అన్నదాతల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఎల్లినో కారణంగా వర్షాలు పడే పరిస్థితులు లేవని రైతాంగం వరి సాగుకు స్వస్తి చెప్పి, ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని గత రెండు నెలల కాలం నుండి జిల్లా కలెక్టర్ రైతులకు సూచించడం జరిగింది. డిసెంబర్ నాటికి కూడా వర్షాలు పడే పరిస్థితులు కూడా లేవని వాతావరణ శాఖ మరోవైపు హెచ్చరిస్తూనే ఉంది. రైతులు ఈ విషయంలో తగ్గేదేల్యా అంటూ వరి సాగుకు పూనుకున్నారు. శ్రీశైలం డ్యాం లో, వెలుగోడు తెలుగుగంగ రిజర్వాయర్లో ఆశించిన స్థాయిలో నీళ్లు ఉన్నాయని, ఏ క్షణంలో నైనా నీళ్లు వదలక పోతారా అని రైతులు మొన్నటి వరకు ఆశగా ఎదురు చూశారు. కేవలం సాగునీటి కొరకు మాత్రమే నీళ్లు నిలువ చేయడం జరిగిందని అధికారులు చెబుతున్నప్పటికీ రైతులు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. రైతులకు సాగునీరు తాగునీరు విడుదల చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ వెలుగోడు రిజర్వాయర్ ముట్టడికి రైతులకు పిలుపునిచ్చింది. నీటి విడుదల విషయంలో రైతుల సానుభూతిని సంపాదించేందుకు వైసిపి పార్టీ ప్రయత్నాలు చేస్తూ ఉందన్న విషయం చర్చకు దారి తీస్తూ ఉంది.



## నీటి విడుదలకు అనుమతులు రాలేదు



సాగునీరు తాగునీటి విషయంలో విడుదలకు సంబంధించి ఎలాంటి అనుమతులు రాలేదని నీటిపారుదల ఉన్నత శాఖాధికారి ఒకరు పేర్కొన్నారు. నీటి విడుదల విషయంలో జిల్లా యంత్రాంగంతో కలెక్టర్ చర్చలు జరుపుతున్నారు అన్న వదంతులు వ్యాపించాయి. చివరకు నీటి విడుదల విషయం వట్టి పుకార్లేనన్న విషయం తేలింది.

# కుల, వర్గ రాజకీయాలతో కాంగ్రెస్‌ను బలహీనపరిచే కుట్రలు సహించం

**కర్నూలు జిల్లా ఇంచార్జి అంటూ కొందరు కుటీల కుట్ర రాజకీయాలు చేస్తున్నారు**

**కాంగ్రెస్‌లో క్రమశిక్షణ ఉల్లంఘనకు తావులేదు**

**రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పోటీ**

**కాంగ్రెస్ వివిధ విభాగాల జిల్లా చైర్మన్లు**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీలో చిచ్చు పెడుతూ కుట్ర రాజకీయాలు చేస్తున్నారని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివిధ విభాగాల జిల్లా చైర్మన్లు మాట్లాడుతూ జాతీయస్థాయిలో ప్రతి రాజకీయ పార్టీకి నియమ నిబంధనలు ఉంటాయని రాష్ట్రపతి ముద్ర తర్వాతనే పార్టీకి గుర్తింపు వస్తుందని 140 సంవత్సరాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీలో పార్టీ సిద్ధాంతాలు నియమ నిబంధనలు ఉంటాయని వారు తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఎన్ సి హెచ్ బజారన్న మాట్లాడుతూ ఈ మధ్య కొందరు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సమంజసం కాదని ఒకవేళ పార్టీ నాయకత్వం నచ్చకపోతే అధిష్టానం దృష్టికి తీసుకొని వెళ్లాలని పార్టీని ధిక్కరించి పత్రికలకు ఎక్కడము సమంజసం కాదని, డిసిసి మీద తోటి వారిని కలుపుకోలేక పోతున్నా పార్టీలో చేరి కేవలం రెండున్నర సంవత్సరాలు అవుతుందని కోడుమూరు ఇన్చార్జినీ, కోఆర్డినేటర్ను అంటున్నారు అలాంటప్పుడు అందరినీ కలుపుకొని పోవాలని ఒక కులంతోనే సమాజాన్ని నిర్మించుకోలేవని కాంగ్రెస్లో నాయకులను సంప్రదించకుండానే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాడని నేను ఎస్సీ జిల్లా చైర్మన్ గా ఉన్నానని నా దృష్టికి కూడా తీసుకురాలేదని, ముందు రోజు స్వాతంత్ర వేడుకల్లో కుర్చీల విషయంలో పెద్ద రాద్ధాంతం చేశాడని, శాలువల విషయంలో తప్పుడు ప్రాపగాండా చేస్తున్నారని ఆరోజు కొప్పుల రాజు కి శాలువ కప్పింది డిసిసి కాదని నేను తెచ్చుకున్న శాలువా కప్పానని, గతంలో ఎంతో మంది మీద తప్పుడు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టావని ఒక ఎస్సీ మీదనే అట్రాసిటీ కేసు పెట్టారని మూడవ టౌన్ పోలీస్ స్టేషన్లో నిరూపిస్తానని ఒక డాక్టర్ మీద కంప్లైంట్ చేశారని ఇలాంటివి మన పార్టీలో వద్దని, పక్కన జిల్లాలో ఒక నాయకుడు ఇలాంటి గొడవలు అన్నీ సృష్టిస్తున్నాడని అధిష్టానం వద్ద చాడీలు చెప్పి రెండు సంవత్సరాల్లో ముగ్గురు జిల్లా అధ్యక్షులను మార్పించాడని, ఎస్సీ ఎస్టీ మైనార్టీ మీటింగ్ జరగకుండా అడ్డుపడ్డాడని మీరు పెట్టే వేధింపులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇంతవరకు భరించారని ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని, మీ జిల్లాలో ఏడు సంవత్సరాలలో రెండు పర్యాయాలు పార్లమెంటుకు పోటీ చేసినా డిసిసిగా చేసినా ఇప్పటికీ మీ జిల్లా కేంద్రంలో ఆఫీసు తెరవలేని స్థితిలో ఉన్నావని, మీరు కర్నూలు జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నావని ఇటీవల మూడు నాలుగు కోట్లు పెట్టి భవనం నిర్మించావని గతంలో నీ ఆస్తులు ఎంత? నీ సంపాదన ఎంత? ఏ వృత్తి లేని నువ్వు ఇంత ఎలా సంపాదించావ్..? ఎంత మందిని బెదిరించి, బ్లాక్మెయిల్ చేసి సంపాదించావ్ అని అన్నారు. కర్నూలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వాటాలు కావాలని, డబ్బులు కావాలని, పదవులు కావాలని కుళ్ళు రాజకీయాలు చేస్తున్నావని నీకు సిగ్గు, శరం లేదా అని బజారన్న ప్రశ్నించారు. రాయలసీమ జిల్లాలకు మస్తాన్వలి గణేష్ కుమార్ ఇన్చార్జిలుగా ఉన్నారని ఏఐసిసి ఆదేశాల మేరకు పిసిసి అధ్యక్షులు గతంలో రాష్ట్ర కమిటీలను అన్ని రద్దు చేసిందని అయినా కర్నూలు జిల్లా ఇన్చార్జినని, సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని మీకు ఆ అధికారం ఎవరిచ్చారని బజారన్న ప్రశ్నించారు. మా జిల్లాలోని ఒక నాయకుడు బాహాటంగా చెప్పుకుంటున్నాడని దళితులను కానీ ఎవరినైనా తొక్కుకుంటూ పైకి ఎదగడమే రాజకీయం అంటున్నాడని, నైతిక దుష్ప్రవర్తన కేసులు ఉండి ఇది వరకే జైలు కి వెళ్లి వచ్చి నేడు అందరినీ ఇబ్బంది పెడుతున్నారు అని ఇలాంటి వారికి తగిన గుణపాఠం దేవుడు చెబుతాడని, ఇప్పటికైనా అందరం కలిసికట్టుగా ఉండి రాహుల్ గాంధీ, వైయస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో పనిచేసి రాహుల్ గాంధీని ప్రధానిగా చేద్దామని వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని బజారన్న తెలియజేశారు. అనంతరం ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో కొందరు నాయకులు కాంగ్రెస్ పార్టీని రెండు మూడు వర్గాలుగా చీల్చి బజారుకీరుస్తున్నారని గత 40 సంవత్సరాలలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదని ఈ మధ్యకాలంలో డిసిసి అధ్యక్ష పదవి కోసం గొడవలు సృష్టించడము కేసులు పెట్టుకోవడం జరుగుతుందని ఎన్నో కుట్రలు పన్నుతున్నారని ప్రశాంతంగా ఐదారు సంవత్సరాలు ఎవరిని ఉండనీయడం లేదని వీటన్నింటికీ మూలకారకుడు పరాయి జిల్లా మాజీ జిల్లా అధ్యక్షుడు అని అతను కర్నూలు జిల్లా అధ్యక్షులు అందరినీ నేనే ఇప్పించానని గొప్పలు చెప్పుకుంటున్నాడు అని అతనికి నచ్చకపోతే వారి పైన అభాండాలు, నిందలు వేసి దించుతా అని బెదిరిస్తున్నారు, ఈ విధంగా కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీని బజారుపాలు చేస్తున్నారని ఈ మధ్యకాలంలో ఒక నాయకుడు ఇతర పార్టీ నుండి వచ్చాడని గత సంవత్సరాలుగా కులమతాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీలో అందరము ఒక కుటుంబంగా నడుచుకుంటున్నామని ఈ మధ్యన కులాల మధ్య నిప్పురాజేసి విభజించుకుంటున్నారని కర్నూలు చరిత్రలో ఇంతవరకు జిల్లా అధ్యక్షుల మీద కేసు పెట్టలేదని గతంలో ఎన్నడూ లేని విధంగా కేసులు పెట్టి ఆ అబాండాలు వేసి ఈ డిసిసిని దింపి డిసిసి అధ్యక్ష పీఠం కోసం కుట్రలు పన్నుతు కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీని వర్గాలుగా విభజిస్తున్నారని ఇతర పార్టీలతో ఒప్పందం చేసుకుని వచ్చే ఎన్నికలలో డిసీసీ అధ్యక్షుని తొలగించి పార్టీని నామరూపాలు లేకుండా చేయాలని కొందరు కుట్రలు పన్నుతున్నారని కర్నూల్ లో సీనియర్ల వల్ల కాంగ్రెస్ పార్టీ ఉనికి కాపాడుకుంటూ వస్తున్నారని అలాంటిది సర్వనాశనం కావాలని చూస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని నిర్ణయం తీసుకున్న రోజు నామరూపాలు లేకుండా పోతారని మీరు గ్రహించాలని కాంగ్రెస్ పార్టీలో ఓనమాలు కూడా తెలియని మీరు ఈ మధ్యకాలంలో వచ్చారని పార్టీ కార్యాలయంలో సమావేశాలు మీటింగ్లు జరగాలంటే ఒక రోజు ముందు అధ్యక్షుల వారితో అనుమతి తీసుకోవాలని, కానీ అలాంటి ఏమి లేకుండా ఇష్టం వచ్చినట్టు వ్యక్తిగత మీటింగ్లు పెడుతూ ఏమైనా అంటే దళితులు ప్రెస్ మీట్ పెట్టకూడదా అని ఉల్లంఘన చేస్తూ కాంగ్రెస్ పార్టీని సర్వనాశనం చేస్తున్నారని, ఇలాంటి వారి పైన కాంగ్రెస్ పార్టీ త్వరలో నిర్ణయం తీసుకుంటాదని తప్పులుంటే సరిదిద్దుకోవాలని వచ్చే ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పని చేస్తేనే కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని కాంగ్రెస్ సిద్ధాంతాలు కట్టుబడి పనిచేయాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ సరైన నిర్ణయం తీసుకుంటుందని ఇప్పటికైనా తప్పులు సరిదిద్దుకొని పెట్టిన కేసులను వెనక్కు తీసుకొని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బతుకన్న తెలియజేశారు. అనంతరం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు క్రాంతి నాయుడు చదువుకున్న, సంస్కారం ఉన్న ఉన్నత వ్యక్తి అని అన్ని కులాలను, మతాలను గౌరవిస్తారని అనంతరత్నం ని కులం పేరుతో దూషించార అనడం సమంజసం కాదని సమస్యను అందరం కూర్చుని పరిష్కరించుకుందామని అన్యాయంగా డిసిసి మీద కేసులు పెట్టడం తప్పు అని మీరు ఏదైనా ఉంటే మీ కోడుమూరు నియోజకవర్గంలో, పని చేసి పోటీకి ప్రయత్నించండి మీరు టిడిపికి బీజేపీకి తొత్తులుగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని అవమానిస్తూ ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ మీకు నచ్చకుంటే పార్టీకి రాజీనామా చేసి వెళ్లాలని, అంతే కానీ పార్టీని బజారుపాలు చేయవద్దని సుమలత తెలియజేశారు. అనంతరం జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని తెలియజేశారు. అనంతరం ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ మాట్లాడుతూ ఒక నియోజకవర్గ ఇన్చార్జి డీసీసీ అధ్యక్షుని మీద అట్రాసిటీ కేసు పెట్టడం సమంజసం కాదని, ఆరోజు అస్సలు ఏ గొడవ జరిగినట్లు అనిపించలేదని డిసిసి అధ్యక్షులను సంఘటన్ శ్రీజన్ అభియాన్ ద్వారా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఒక సమగ్ర నివేదిక ద్వారా రాహుల్ గాంధీ కర్నూలు జిల్లా అధ్యక్షులు క్రాంతి నాయుడు ని నియమించారని అలాంటి వారిని తొలగించాలని ప్రయత్నాలు చేయడం మానుకోవాలని ప్రతాప్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గోనెగండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముల్లా ఖాసీం వలి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఒసామా మొదలగు వారు పాల్గొన్నారు.




# అక్రమంగా వేసిన బోరును వెంటనే సీజ్ చేయాలి

**కాశినాయన మండల తాసిల్దార్ కు వినతిపత్రం**

**బాధితుడికి అండగా మాలమహానాడు,హ్యూమన్ రైట్స్, దళిత సంఘాలు**



**కాశినాయన, ఆగస్టు 31 (నంది పత్రిక ):**వైయస్సార్ కడప జిల్లా బద్వేల్ సబ్ డివిజన్ శ్రీ అవధూత కాశినాయన మండలం శివరామపాలగిరి గ్రామం ఎస్సీ మాల కులమునకు చెందిన బాల సుబ్బయ్య గారి లక్ష్మయ్య s/o రామయ్య అనువారికి 1986 సంవత్సరంలో సర్వేనెంబర్ 703/1 నందు డి పట్టా నెంబర్ 38/95 గా 5.00ఎకరములు వ్యవసాయభూమిని ప్రభుత్వం మంజూరు చేసి ఉన్నది.నాటి నుంచి 2010 వరకు సదరు భూమిని సాగు చేసుకొనుచున్నారు.అయితే 2010 లో చిన్నపు నారాయణమ్మ ఔ /ం సిద్ధారెడ్డి మురుకుటి నారాయణమ్మ ఔ /ం చెన్నకృష్ణారెడ్డి మధ్య సదరు భూమి విషయంలో వివాదం ఏర్పడడంతో 2010లో రెవిన్యూ వారు సదరు భూమిలో దిగవద్దని ఇరువురికి నోటీసులు జారీ చేయడం జరిగినది అప్పటినుండి ఇరువురము సాగు చేయలేదు. ప్రస్తుతం సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ వ్యవసాయ కార్మిక సంఘం లీడర్ గా కొనసాగుతున్న యంబడి పోలయ్య అను వ్యక్తి సదరు పొలం నందు దౌర్జన్యం గా దిగి పొలం నాది అని రాత్రికి రాత్రి బోరు వేసి సిపిఎం పార్టీని అడ్డుపెట్టుకుని అధికారులు మేనేజ్ చేస్తూ దౌర్జన్యానికి దిగుతున్నాడు.సదరు సమస్య విషయమై బాధితులు మాల మహానాడు కడప జిల్లా అధ్యక్షులు జక్కుల కిరణ్ మరియు నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్యాల ప్రసాదరావు మరియు సీనియర్ దళిత నాయకులు ముత్యాల చెన్నారాయుడు మరియు పలువురు ప్రజా సంఘాల నాయకులను సంప్రదించగా వారంతా కాశినాయన మండల తాసిల్దార్ కి వినతి పత్రం సమర్పించి అక్రమంగా బోరు వేసిన యంబడి పోలయ్య పై చట్టపరమైన చర్యలు తీసుకుని సదరు బోర్ ను వెంటనే సీజ్ చేయాలని కోరడం జరిగినది.అందుకు తాహసిల్దార్ స్పందిస్తూ రెండు రోజుల్లో విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో మాలమహానాడు జక్కుల కిషోర్,చాటకొండ రవి బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కుంభగిరిలో ఘనంగా రామాలయ శంకుస్థాపన



**అట్లూరు, ఆగస్టు 30 ( నంది పత్రిక):** వైయస్సార్ కడప జిల్లా అట్లూరు మండలం కుంభగిరి గ్రామంలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎ ఎం సీ డైరెక్టర్ కె. శివశంకర్ ఆహ్వానం మేరకు బద్వేల్ ఎ ఎం సీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామాలయ నిర్మాణం శుభప్రదంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎ ఎం సీ డైరెక్టర్లు చిన్ని సుబ్బారావు, తిరువీధి హుస్సైనమ్మ, సుబ్బారావు, నాగేంద్ర, కార్యదర్శి చంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏ ఎం సి డైరెక్టర్ కె. శివశంకర్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి హాజరైన అతిథులు, ప్రముఖులను శాలువాలతో సత్కరించి చిరు సన్మానం చేశారు. కుంభగిరి గ్రామంలో రామాలయ నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా అభినందించారు.

# తుర్కు యూనివర్సిటీ ప్రశంసా పత్రాన్ని అందుకున్న బండి పరిమళ జ్యోతి



**కాశినాయన, ఆగస్టు 31 (నంది పత్రిక):**రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు విద్యా విషయక అంశాల పరిశీలన నిమిత్తం ఫిన్లాండ్ వెళ్ళిన విద్యా విషయక పర్యటన విజయవంతమైందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని బండి పరిమళ జ్యోతి తెలిపారు. ఆగస్టు 17 నుండి ఫిన్లాండ్ లోని తుర్కు యూనివర్సిటీలో జరిగిన అంతర్జాతీయ పర్యటన కార్యక్రమం విజయవంతమైనది పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో రాష్ట్రం నుండి 29 మంది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ బృందం ఈనెల 16న ఫిన్లాండ్ పర్యటనకు వెళ్లిన విషయం విధితమే. అయితే అక్కడ ఈనెల 17వ తేదీ నుండి 26వ తేదీ వరకు శిక్షణా కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పలు విద్యావిధానాలపై పూర్తి అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లాకు చెందిన కాశి నాయన మండలం రెడ్డి కొట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఎస్ జి టి గా విధులు నిర్వహిస్తున్న హరిత ఫౌండేషన్ కోఆర్డినేటర్ బండి పరిమళ జ్యోతిని తుర్కు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ , పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా సమక్షంలో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బండి పరిమళ జ్యోతి మాట్లాడుతూ ఈ పర్యటన ఎంతో అనుభూతినిచ్చిందని ఇంతటి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర విద్యా శాఖా మాత్యులు నారా లోకేష్ గారికి ధన్యవాదాలు తెలిపారు.

# వైసీపీ నాయకునికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**బనగానపల్లె ఆగష్టు 31నందిపత్రిక** కొలిమిగుండ్ల మండలం బందార్ల పల్లె గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు యాతం వెంకట శివరామిరెడ్డి ప్రేగు సమస్యకు సంబంధించి శస్త్రచికిత్స చేయించుకొన్న విషయాన్ని తెలుసుకొని సోమవారం మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి కర్నూలులోని ప్రవేట్ ఆసుపత్రికి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకుంటావని ధైర్యం చెప్పారని వైసీపీ కార్యాలయం తెలిపారు.



# సత్వర న్యాయానికి లోక్ అదాలత్..!

**డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్**

**సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి**

**కడప జిల్లాలో గత రికార్డును అధిగమించేలా కేసుల పరిష్కారానికి కృషి**



**కడప, ఆగస్టు 31 :** ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విస్తృతంగా సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నామని డీఎల్ఎస్ఏ చైర్మన్, కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్ తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కోర్టు సముదాయంలోని తన ఛాంబర్ లో గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్ పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి తోపాటు డిఎల్ఎస్ఏ సెక్రెటరీ, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఈ నెల 19న జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో గతంలో కంటే అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, చట్టాలపై న్యాయ అవగాహన కల్పించడం, సత్వర న్యాయం అందించడం న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యాలని రామ్‌గోపాల్ వివరించారు. ఈ లక్ష్యాల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర, జిల్లా, తాలూకా స్థాయిల్లో న్యాయ సేవా సంస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు.

**ఏడీఆర్ ద్వారా సత్వర పరిష్కారం...** కోర్టుల్లో సాధారణ న్యాయ ప్రక్రియ ద్వారా కేసుల పరిష్కారానికి కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, ప్రజలు ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీటిలో ప్రజలకు సుపరిచితమైన లోక్ అదాలత్ ముఖ్యమైనదని తెలిపారు. సివిల్ కేసులతో పాటు రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**జూలై లోక్ అదాలత్‌లో 1,05,798 కేసుల పరిష్కారం...** 2026 జూలై 11న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కడప జిల్లాలో సుమారు 1,05,798 కేసులు పరిష్కారమయ్యాయని రామ్‌గోపాల్ తెలిపారు. ముఖ్యంగా చిన్నచిన్న క్రిమినల్ కేసులు, రాజీకి అవకాశం ఉన్న వివిధ క్రిమినల్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కడప జిల్లా రెండో స్థానాన్ని సాధించిందని వెల్లడించారు. ఈ విజయానికి జిల్లా యంత్రాంగం, కలెక్టర్, ఎస్పీ, న్యాయవాదులు, బార్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు అందించిన సహకారం ఎంతో కీలకమని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**గత రికార్డును అధిగమించడమే లక్ష్యం..**

సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో గతంలో పరిష్కరించిన కేసుల సంఖ్యను అధిగమించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ప్రజలు తమకు సంబంధించిన రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని కోరారు.

**ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి...** లోక్ అదాలత్‌లు, న్యాయ సేవలు, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని రామ్‌గోపాల్ అన్నారు. ఒక ఉపన్యాసం ద్వారా సమాచారం పరిమిత సంఖ్యలో ప్రజలకు చేరే అవకాశం ఉన్నప్పటికీ, మీడియా ద్వారా లక్షలాది మందికి సమాచారం చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. గతంలో మీడియా అందించిన సహకారాన్ని అధిగమిస్తూ.. సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ గురించి ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను కోరారు. ప్రజలకు ఉపయోగపడే న్యాయ విజ్ఞాన సదస్సులు, లోక్ అదాలత్‌లు, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాల ద్వారా కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించడంలో మీడియా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సత్వర, సులభమైన న్యాయం అందించడమే లక్ష్యంగా సెప్టెంబర్ 12 జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్ తెలిపారు.

## పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయునికి ఘనంగా వీడ్కోలు.



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 31 (నంది పత్రిక):** మండల పరిధిలోని పెద్దకంబలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న తిరుపతయ్య సోమవారం పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య దంపతులను పూలమాలవేసి శాలువతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయునికి పదవీ విరమణ సర్వసాధారణ మన్నారు.మా పాఠశాల యందు ప్రధానోపాధ్యాయుడైన తిరుపతయ్య మా అందరితో స్నేహ స్వభావం కలిగి కలిసిమెలిసి విధులు నిర్వహించేవాడని. విద్యార్థుల పట్ల మంచితనంతో వారికి నడవడికను నేర్పుతో పాఠశాలను అభివృద్ధి దిశగా తీసుకువెళ్లారన్నారు. పాఠశాలకు ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన మంచితనాన్ని ఉపాధ్యాయులు అందరూ స్మరించుకున్నారు. పదవీ విరమణ పొందిన అనంతరం ఆయన పిల్లాపాపలతో సుఖసంతోషాలతో ఆడుతూ పాడుతూ జీవించాలని మనసారా కోరుకుంటూ మా పాఠశాల తరపున వీడ్కోలు పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## పొలం సర్వే చేసి సమస్య పరిష్కరించండి..


**గుండంపాడు రైతు సోదరులు....**



**సిరివెళ్ల::( నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని గుండంపాడు గ్రామ రైతులు రెవెన్యూ మజారా అయినటువంటి మహదేవపురం గ్రామంలో గల ఎంత 39/1 మూడు ఎకరాల 38 సెంట్ల పొలానికి సంబంధించి నాలుగు వైపులా సర్వే హద్దురాళ్ళు ఏర్పాటు చేసుకునేలా తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని గ్రామానికి చెందిన అంబటి నరసింహారెడ్డి, అంబటి లక్ష్మి కాంత్ రెడ్డి సోమవారం సిరివెళ్ల తహసిల్దార్ గారికి అర్జీ ఇచ్చుకున్నారు. వెంటనే స్పందించిన తాసిల్దార్ సర్వే కొలతలకు ఆదేశించారు. 1952 పూర్వం నుండి మూడు ఎకరాల 38 సెంట్లు విస్తీర్ణంలో సాగు చేసుకుంటూ జీవనం చేస్తున్నామన్నారు. తమ గ్రామంలోని ఒక సామాజిక వర్గానికి చెందినటువంటి కులానికి స్మశాన వాటిక సమస్య తలెత్తి నందున తమ పొలం ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని తహసిల్దారులు కోరారు.

## పదవి విరమణ పొందిన దేవస్థానం ఉద్యోగికి ఘన సత్కారం

**మహానంది, ఆగస్టు 31 (నంది పత్రిక):-** ప్రతి ఉద్యోగికి భక్తులకు అందించిన మంచి సేవలతోనే గుర్తింపు వస్తాయని ఆలయ ఏఈఓ వై.మధు పేర్కొన్నారు.వి.లక్ష్మీనారాయణ శ్రీశైలం నుంచి బదిలీపై మహానంది దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు.సోమవారం పదవీ విరమణ సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగ మల్లయ్య, జగదీశ్వర్ రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ఖండిస్తూ కడపలో కాంగ్రెస్ నిరసన ర్యాలీ

**కుల వివక్షతో కూడిన శుద్ధికరణకు పాల్పడిన బీజేపీ కార్యకర్తలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

**బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్**




కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున్ ఖర్గే గారి ర్యాలీ జరిగిన ప్రదేశంలో బీజేపీ కార్యకర్తలు కుల వివక్షను ప్రదర్శిస్తూ నిర్వహించిన శుద్ధికరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ గారిపైనే ఉత్తరాఖండ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం రవీంద్ర నగర్, కడపలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి వై.ఎస్. షర్మిలా రెడ్డి గారి ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఎన్.డి. విజయ జ్యోతి గారి సూచనలతో, కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ శ్రీ బండి జకరయ్య ఆధ్వర్యంలో ఈ నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా బండి జకరయ్య మాట్లాడుతూ, దేశంలో కుల వివక్షకు తావులేకుండా రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించిన ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీపై కేసులు నమోదు చేయడం ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ఒకవైపు కుల వివక్షతో కూడిన చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఆ ఘటనను ప్రశ్నించిన రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అన్యాయమని అన్నారు. బీజేపీ కార్యకర్తలు నిర్వహించిన కుల వివక్షతో కూడిన శుద్ధికరణ కార్యక్రమానికి బాధ్యులైన వారిపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం తక్షణమే కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే శ్రీ రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని, భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం వంటి విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన ర్యాలీలో కేకేసీ జిల్లా చైర్మన్ దాసరి శ్రీనివాసులు, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ బాషా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సుధాకర్, దినకర్, జాబిర్ అలీ, కేకేసీ కడప నగర చైర్మన్ షామీర్ హుస్సేన్, రాయుడు, జహూర్ అహ్మద్, మహమ్మద్ హుస్సేన్, రెడ్డి బాబు, ఖాజాపీర్, ప్రత్యూష్, సునీల్, బాలాజీ, విగ్నేష్, జస్వంత్, చక్రి, వన్నూరు సాబ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 3 నుండి 6 వరకు గ్రామ సభలు



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 31 (నంది పత్రిక):** మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో ఈనెల 3 నుండి 6 వరకు ఓటరు జాబితా పై గ్రామసభలు నిర్వహించ నున్నట్లు ఇన్చార్జి ఎంపిడిఓ బాలాంజనేయులు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని గ్రామసభల ద్వారా ఓటర్ జాబితా బహిరంగ ప్రచురణ చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ సిబ్బంది గుర్తించిన ఎస్సీ ఎస్టీ బీసీ లో ఓటర్ జాబితాలో ఆ వర్గాల వారు ఏవైనా సమస్యలు పొరపాట్లు ఉన్నట్లయితే గ్రామ సభలో ఫిర్యాదు చేయాలన్నారు. వారి ఫిర్యాదు స్వీకరించి ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఇన్చార్జి ఎంపీడీవో తెలిపారు.

## పోరుమామిళ్లలో 30 మంది విద్యార్థులతో ఏబీవీపీ నూతన నగర కమిటీ ప్రకటన...

**విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాం-ఏబీవీపీ**



**పోరుమామిళ్ల, ఆగస్ట్ 31 (నంది పత్రిక):**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) పోరుమామిళ్ల శాఖ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులతో ఏబీవీపీ పోరుమామిళ్ల నూతన నగర కమిటీని ప్రకటించడం జరిగింది. నగర అధ్యక్షులుగా దేవేంద్రనాథ్ ని, నగర కార్యదర్శిగా కార్తీక్‌ను నియమించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాండురంగారెడ్డి , ముఖ్య వక్తలుగా బాల రంగయ్య గారు, బుసిరెడ్డి మనోహర్ రెడ్డి గారు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడటమే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) ప్రధాన లక్ష్యమని తెలిపారు.విద్యార్థులు విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.పోరుమామిళ్ల ప్రాంతంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిపై నిరంతరం ఉద్యమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల గొంతుకగా ఏబీవీపీ నిలవాలని నూతన నగర కమిటీకి సూచించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన 30 మంది కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, పోరుమామిళ్లలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అభిలాష్,చంద్ర,కార్తీక్,హర్ష,ముని,శివ,జైచంద్ర,రవీంద్ర, బ్రహ్మయ్య,మహేష్ మరియు ఏబీవీపీ కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 31 (నంది పత్రిక)** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానాలను భర్తీ చేసేందుకు తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించినట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటస్వామి రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 - 27 విద్యాసంవత్సరానికి సంబంధించి 12 మందిని అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లుగా నియమించడం జరిగిందన్నారు. దేగల అరుణ ప్రాథమిక పాఠశాల పెద్దకంబలూరు, చెల్లా పావని ప్రాథమిక పాఠశాల నాగిరెడ్డిపల్లె, కుమ్మరి వెంకట సుదర్శన్ ప్రాథమిక పాఠశాల చిలకలూరు, వాసగిరి జంబులమ్మ ప్రాథమిక పాఠశాల టీ లింగందిన్నె, పన్నెగట్ల కాశీం ప్రాథమిక పాఠశాల టి లింగందిన్నె, మిద్దూరి నిర్మల ప్రాథమిక పాఠశాల స్పెషల్ మందలూరు, సూరబోయిన వరమహాలక్ష్మి ప్రాథమిక పాఠశాల తిమ్మనపల్లె, పాణ్యం వేణుగోపాల్ ప్రాథమిక పాఠశాల చిత్రేనిపల్లె, వడ్డే మణిజ్యోతి ప్రాథమిక పాఠశాల ఆలమూరు తిప్ప, బైరం భారతి ప్రాథమికోన్న పాఠశాల ముకుందాపురం, మదర్ వలి షేక్ ప్రాథమికోన్నత పాఠశాల రుద్రవరం, కాకి శ్వేతా మాధురి ప్రాథమికోన్నత పాఠశాల నరసాపురం నియమించడం జరిగిందని ఎంఈఓ తెలిపారు. తాత్కాలిక ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేశామని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు పాల్గొన్నారు.

## అపర భగీరదుడు చంద్రబాబు-వెలిగొండప్రాజెక్టు నుండి మొదటి దశ నీటిని విడుదల చేసి మాట నిలుపుకున్నారు.

**కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో వారికి వారే సాటిఅని వెలిగొండ ప్రాజెక్టుకు మొదటి దశ నీటిని విడుదల చేసి మరోసారి రైతుల పట్ల ప్రజలకు ఇచ్చిన వాగ్దానం పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకున్న వ్యక్తి నారా చంద్రబాబు నాయుడు అని కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈరోజు వారు తన కార్యాలయం నుంచి పత్రికల వారితో మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ. ప్రాజెక్టుకు 1996లో శంకుస్థాపన చేశారని వారే నేడు వెలిగొండ ప్రాజెక్టు నుండి మొదటి దశ నీటిని విడుదల చేసి 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు నాలుగు లక్షలకు పైగా జనాభాకు త్రాగునీటినందించి ప్రకాశం మార్కాపురం నెల్లూరు కడప జిల్లాల ప్రజలకు ఈరోజు నీటినందించి ఒక పండగ వాతావరణాన్ని సృష్టించినటువంటి అపర భగీరథుడు గా చంద్రబాబు నాయుడు నిలిచారని ఆయన తెలియజేశారు అలాగే ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ పొలాలను అందించిన నిర్వాసితులకు ప్రభుత్వము నుండి 762 కోట్ల రూపాయలను అందించిన ఘనత చంద్రబాబుదకే దక్కిందని వివరించారు. నారా చంద్రబాబు నాయుడు ఒకపక్క రాష్ట్రంలోని ప్రాజెక్టులకు, అమరావతి నిర్మాణం కు కేంద్రంతో ప్రాధేయపడి ప్రధానమంత్రి సహకారంతో రాష్ట్రానికి నిధులను రాబట్టి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీరు అందిస్తుంటే పనీపాటా లేని గొడ్డలి పార్టీ నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి వెలుగొండ ప్రాజెక్టు తననే పూర్తి చేసినట్లు అసత్య ప్రచారం చేసుకుంటూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని జగన్మోహన్ రెడ్డికి ఇది కొత్తేమీ కాదని తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి ప్రభుత్వము ఏ అభివృద్ధి కార్యక్రమం ప్రజల కోసం చేపట్టిన పూర్తి చేసిన దానిని తానే చేశానని తానే తెచ్చానని ఉత్తర ప్రగల్భాలు పలుకుతూ ప్రజలను మభ్యపెట్టి ప్రయత్నం చేస్తున్నారని ఇది జగన్కు కొత్తేమీ కాదని అన్నారు.జగన్మోహన్ రెడ్డి ఒకపక్క తండ్రి శవాన్ని అడ్డం పెట్టుకొని ముఖ్యమంత్రి సీటు పొందాలని సంతకాల సేకరణ చేశాడని సోనియా గాంధీ సహకరించలేదన్న దురుద్దేశంతో ఆమెకు వెన్నుపోటు పొడిచి రాష్ట్రంలో అసలైన వెన్నుపోటు దారుడుగా నిలిచిన వాడు జగన్ అని అలాంటి వ్యక్తి చంద్రబాబు నాయుడు గురించి అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నాడని అయితే రాష్ట్ర ప్రజలు తెలివి కలిగిన వారు కనుక జగన్ ను కనీసం ప్రతిపక్ష నాయకుడిగా కూడా ఒప్పుకోకుండా పులివెందల ఎమ్మెల్యే గానే ఉంచారని జగన్ ఇలాగే చంద్రబాబు పైన కూటమి పార్టీల పైన తప్పుడు ప్రచారం చేస్తుంటే ఇక ఈ సీటు కూడా వదులు కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు వెలిగొండ ప్రాజెక్టు తన వల్లనే వచ్చిందంటూ తానే సాధించాను అంటూ తప్పుడు మాటలు మాట్లాడే జగన్మోహన్ రెడ్డి మార్కాపురం వెళ్లి అక్కడి ప్రజలను అడిగితే తెలుస్తుంది ఎవరివల్ల వెలిగొండ ప్రాజెక్టు పూర్తయింది అనే విషయం. అంతేగాని రౌడీ మూకాలను వెంట వేసుకొని దౌర్జన్యాలకు పాల్పడే జగన్మోహన్ రెడ్డి ఇకనైనా నీ అరాచకాలకు స్వస్తి చెప్పాలని నీవు చంద్రబాబు నాయుడు పైచేస్తున్న అసత్య ఆరోపణలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో నీకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# పనుల్లో నిక్కచ్చి.. సర్వీసులో సమర్థత

## ఘనంగా తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ ఆత్మీయ వీడ్కోలు సభ.

**వెలుగోడు ఆగస్టు 31 (నంది పత్రిక):** రెవెన్యూ శాఖలో భూ సమస్యల పరిష్కారం అత్యంత సంక్లిష్టమైనదని, ఎన్నో ఒత్తిళ్లు, కష్టనష్టాలు ఎదురైనా వెలుగోడు తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ తన 39 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో అత్యంత నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి ప్రత్యేక ముద్ర వేశారని రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) వెంకట శివ, ఏపీ రెవెన్యూ జేఏసీ అధ్యక్షులు రామచంద్రయ్య కొనియాడారు.వెలుగోడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన శ్రీనివాసులు గౌడ్ ఆత్మీయ సన్మాన కార్యక్రమం సోమవారం స్థానిక ఎస్.ఆర్ ఫంక్షన్ హాలులో ఆర్డీఓ అధ్యక్షతన వైభవంగా జరిగింది.

**39 ఏళ్ల సుదీర్ఘ ఉజ్వల సేవా ప్రస్థానం**

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూఉద్యోగ జీవితంలో ప్రవేశించిన ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ అనేది సహజమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. శ్రీనివాసులు గౌడ్ 1987లో ఉయ్యాలవాడ మండలంలో టైపిస్ట్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం గోస్పాడు, నంద్యాల తదితర ప్రాంతాల్లో టైపిస్ట్, సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహసీల్దార్‌గా, చివరగా తహసీల్దార్‌గా పదోన్నతి పొంది విభిన్న హోదాల్లో 39 సంవత్సరాల పాటు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా విశేష సేవలందించారని గుర్తుచేసుకున్నారు.

**సవాళ్లను అధిగమించి నిష్పక్షపాత సేవలు** రెవెన్యూ శాఖలో భూ వివాదాలను పరిష్కరించే క్రమంలో ఒకరికి న్యాయం జరిగితే మరొకరికి అసంతృప్తి కలగడం వల్ల అనేక తలనొప్పులు ఎదురవుతుంటాయని, అలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లోనూ శ్రీనివాసులు గౌడ్ చట్టబద్ధంగా, సమర్థవంతంగా నిర్ణయాలు తీసుకుంటూ అధికారుల, ప్రజల మెప్పు పొందారని కొనియాడారు.



**ప్రజాప్రతినిధులు, అధికారుల ఘన సన్మానం** ఈ వీడ్కోలు సమావేశంలో వివిధ మండలాల తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు, రిటైర్డ్ అధికారులు పాల్గొని శ్రీనివాసులు గౌడ్ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, వారి విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలు, ఆనందాలతో సాగాలని ఆకాంక్షించారు.

**హాజరైన ప్రముఖులు:** ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీఓ మధుసూదన రెడ్డి, మాజీ ఎంపీపీలు అంబాలా రామసుబ్బారెడ్డి, ఎల్లాల కృష్ణుడు, సింగిల్ విండో డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, రిటైర్డ్ ఏఓ శ్రీనివాసులు, రిటైర్డ్ తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే జూపాడు బంగ్లా తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, నందికొట్కూరు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణిలతో పాటు పాములపాడు, బండి ఆత్మకూరు, శ్రీశైలం మండలాల తహసీల్దార్లు, పలువురు టీడీపీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# చదువుల గుడియా..
# చెత్తకుప్పల గోడౌనా?!





**నెత్తిపై పెచ్చులూడే పైకప్పు.. చుట్టూ దుర్గంధం వెదజల్లే చెత్తబుట్టలు! 114 మంది పసిగుండెల్లో చావు భయం.. నేలపైనే పడి అక్షర రోదన విద్యాశాఖ మంత్రి లోకేష్ గారూ.. ఇదేనా 'మనబడిమన భవిష్యత్తు'?!**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో** ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు పేరు పెట్టుకున్న ఆ బడిలో అడుగుపెడితే కడుపు తరుక్కుపోతోంది. అది విద్యార్థులను తీర్చిదిద్దే జ్ఞాన భాండాగారమా లేక పురపాలక శాఖ పారేసిన చెత్త డబ్బాల డంపింగ్ యార్డా అన్నది అర్థం కాక జనం ముక్కున వేలేసుకుంటున్నారు. కర్నూలు నగరం నడిబొడ్డున ప్రకాశ్‌నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల దుస్థితిని చూస్తే పాలకుల మాటల గారడీకి, అధికారుల రాతి గుండెలకు నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతామన్న ప్రగల్భాలు ఇక్కడ చెత్తబుట్టల కింద సమాధి అయిపోతున్నాయి.

**పసి హృదయాల మధ్య 'మున్సిపల్ చెత్త'!**

నగరంలో ఎక్కడెక్కడి నుంచో తెచ్చిన మున్సిపాలిటీ చెత్తబుట్టలు దొంగలపాలు కాకుండా కాపాడటానికి పాఠశాల గది దొరికిందా? చెత్తబుట్టలను కాపాడేందుకు చిన్నారుల ప్రాణాలను, ఆరోగ్యాన్ని పణంగా పెడతారా? విషపు వాసనలు, కంపు కొట్టే చెత్తబుట్టల మధ్యే 114 మంది అమాయక చిన్నారులు గంటల తరబడి కూర్చుని పాఠాలు వినాల్సి వస్తోంది. చెత్తబుట్టల రక్షణపై ఉన్న శ్రద్ధ.. పసిపిల్లల భవిష్యత్తుపై విద్యాశాఖ అధికారులకు ఎందుకు లేకపోయింది?

**కూలడానికి సిద్ధంగా పైకప్పు.. వణికిపోతున్న చిన్నారులు!**

తరగతి గదుల్లో కూర్చోవాలంటేనే పసిపిల్లల వెన్నులో వణుకు పుడుతోంది. ఎప్పుడు ఏ పెచ్చు నెత్తిపై పడి ప్రాణం పోతుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని చదువుకుంటున్నారు. కిటికీలు ఊడిపోయి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ విద్యార్థులు పడుతున్న నరకయాతన వర్ణనాతీతం. కూర్చోవడానికి కనీసం బెంచీలు కూడా ఇవ్వని దౌర్భాగ్య స్థితిలో, దుమ్ముధూళి నిండిన నేలపైనే గంటల తరబడి పసికూనలు మోకాళ్లపై చదువు సాగిస్తున్నారు.

**"సార్.. పెచ్చులు నెత్తిన పడతాయేమోనని భయంగా ఉంది. చెత్తబుట్టల వాసన భరించలేకపోతున్నాం. మంత్రి లోకేష్ సార్.. మా బడిని బాగుచేసి మమ్మల్ని కాపాడండి!"**

**కన్నీటి పర్యంతమైన పసిపిల్లల ఆర్తనాదం**

బాధ్యత మరిచిన యంత్రాంగం.. హెచ్ఎం చేతులెత్తేత!

స్టోర్ రూమ్‌లనే తరగతి గదులుగా మార్చేశామని, బల్లల కొరత తీవ్రంగా ఉందని ప్రధానోపాధ్యాయురాలు కళావతమ్మ చెబుతున్నారు. ఈ సమస్యలను ఎప్పటికప్పుడు మండల విద్యాశాఖ అధికారి (వీజూ) దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. సమస్యలు తెలిసి కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారుల తీరుపై స్థానిక ప్రజలు, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**లోకేష్ సార్.. కర్నూలు బడిపై కనికరం చూపండి!**

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెస్తామని, పేద విద్యార్థులకు అండగా ఉంటామని నినదిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే ఈ పాఠశాల దుస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలి. తక్షణమే ప్రకాశ్‌నగర్ పాఠశాలను ఆధునీకరించి, మౌలిక వసతులు కల్పించి, విద్యార్థుల ప్రాణాలకు భరోసా ఇవ్వాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతోంది.





# అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది.

# 35 ఏళ్ల సేవకు వీడ్కోలు

## రిటైర్ అయిన డ్రాయింగ్ టీచర్ ఎస్. విజయభాస్కర్‌రెడ్డికి ఘన సన్మానం



**నంద్యాల నంది పత్రిక వ్యవసాయ విలేఖరి ఆగస్టు 31:** నంద్యాల పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా సుమారు 35 సంవత్సరాల పాటు సేవలందించిన ఎస్. విజయ భాస్కర్‌రెడ్డి 62 ఏళ్ల వయసులో ఉద్యోగ విరమణ పొందారు. విజయభాస్కర్‌రెడ్డి గతంలో ఆధోని లోని మున్సిపల్ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం గత ఎనిమిది సంవత్సరాలుగా టెక్కే మున్సిపల్ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా తన సేవలను కొనసాగించారు. విద్యార్థులకు డ్రాయింగ్ విద్యను అందించడంతో పాటు సహచరులతో, అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ మంచి పేరు సంపాదించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన పదవీ విరమణను పురస్కరించుకుని సన్నిహితులు, సహచరులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రభ సీనియర్ జర్నలిస్ట్ వేణుగోపాల్‌రెడ్డి, హిందీ టీచర్ హుస్సేన్‌బాషా, నంది పత్రిక అగ్రికల్చర్ రిపోర్టర్ సమీర్ బాషా తదితరులు కార్యక్రమంలో పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డిని శాలువా కప్పి హృదయపూర్వకంగా సత్కరించి, ఆయన అందించిన సేవలను అభినందించారు. 35 ఏళ్ల పాటు విద్యారంగంలో సేవలందించిన ఆయనకు భవిష్యత్తు జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు.

# పోలింగ్ కేంద్రాలు సిద్ధం



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 31 (నంది పత్రిక):** మండలంలోని ఆయా గ్రామాలలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసినట్లు ఇన్చార్జి ఎంపిడిఓ బాలాంజనేయులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం పోలింగ్ కేంద్రాల ఫైనల్ జాబితాను ప్రచురించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండలంలోని 21 గ్రామపంచాయతీల లో అన్ని వసతులు సౌకర్యాలతో కూడిన 204 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాల పరిధిలో 37,432 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి, పి ఆర్ ఏ ఈ కమల్ సాహెబ్, పంచాయతీ కార్యదర్శులు అరవింద్ నాయక్ ,మహేష్ సిబ్బంది ఉన్నారు.

# సామూహిక వినాయక నిమజ్జనానికి వినాయక సాగర్ వద్ద ఏర్పాట్లు పక్కాగా చేయండి.

**మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు సహకరించండి.**

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు - కమిషనర్ జయకృష్ణ**

**తిరుపతి లో వినాయక నిమజ్జనాన్ని మూడవ రోజు**

**పూర్తి చేసేందుకు సహకరించాలి : ఎస్పీ సుబ్బరాయుడు**



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** వినాయక చవితి వేడుకలు సామూహిక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. వినాయక సాగర్ లో నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ జయకృష్ణ, తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటి కన్వీనర్ సామంచి శ్రీనివాస్, కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. వినాయకసాగర్ లోని కుంటల్లో తెలుగు గంగ నీటిని నింపాలని నిర్ణయించారు. టిటిడి, కార్పోరేషన్, పోలీసు,తుడ, అగ్నిమాపక, ఎక్సైజ్, హెల్త్, పర్యాటక శాఖలను సమన్వయం చేసుకుని నిమజ్జనాన్ని ప్రశాంతంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ తో తయారు చేసిన విగ్రహాలు కాకుండా మట్టి వినాయక విగ్రహాలు ప్రతిష్టించాలని ఆయన కోరారు.గత ఏడాది కన్నా ఈ ఏడు విగ్రహాల ఏర్పాటు పెరిగే అవకాశం ఉందని దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటిని సంప్రదించి మండపాల ఏర్పాటుకు ప్రజలు అనుమతులు తీసుకోవాలని ఆయన సూచించారు. వినాయక సాగర్ లో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిపేందుకు అవసరమైన భద్రతా పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. 14వ తేదీ నుంచి శ్రీవారి బ్రహోత్సవాలు ప్రారంభమౌతున్నందున వినాయక నిమజ్జనాన్ని మూడవ రోజు పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. నిమజ్జన రోజు ర్యాలీలో డిజేలు, టపాసులు పేల్చడం, మద్యం సేవించడం వంటివి చేయకుండా మండపాల నిర్వాహకులు, యువత సహకరించాలని ఆయన కోరారు. పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను ప్రజలు పూజించాలని కార్పోరేషన్ కమిషనర్ జయకృష్ణ కోరారు. అన్ని విభాగాలను కలుపుకుని టీం వర్క్ గా నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరిగేలా చూస్తామని ఆయన చెప్పారు. కమిటీ కన్వీనర్ తిరుపతి లో చవితి వేడుకలను ఆదర్శవంతంగా ఆధ్యాత్మిక వాతావరణం లో నిర్వహించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, డి ఎస్ పి లు భక్తవత్సలం,, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలమెంట్ డైరెక్టర్ వూకా విజయకుమార్, వినాయక నిమజ్జన కమిటి సభ్యులు ఆర్. సి. మునికృష్ణ, గుండాల గోపి, చెన్నం నవీన్, వరప్రసాద్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



# సమాచార శాఖలో సుదీర్ఘ సేవలకు అభినందనల వెల్లువ....





### పదవీ విరమణ పొందిన సహాయ పౌర సంబంధాల అధికారి కె.టి.ఎం.కె.ఎన్. సత్యనారాయణ రాజుకు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సన్మానం

**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** సమాచార శాఖలో 33 సంవత్సరాల 2 నెలల పాటు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తూ విశిష్టమైన, అమూల్యమైన సేవలు అందించిన సహాయ పౌర సంబంధాల అధికారి కె.టి.ఎం.కె.ఎన్. సత్యనారాయణ రాజు పదవీ విరమణ సందర్భంగా అభినందనలు వెల్లువెత్తాయి. ముందుగా జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆయనను చిరు సత్కారంతో సన్మానించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సమాచార వారధిగా సమాచార శాఖ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సుదీర్ఘకాలం పాటు సమాచార శాఖలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేసిన కె.టి.ఎం.కె.ఎన్. సత్యనారాయణ రాజు సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి శాఖకు విశిష్ట సేవలు అందించిన ఆయనకు అభినందనలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ టి. మోహన్‌రాజు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది కె.టి.ఎం.కె.ఎన్. సత్యనారాయణ రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని, ఆయన అందించిన సహకారాన్ని స్మరించుకుంటూ పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కె.టి.ఎం.కె.ఎన్. సత్యనారాయణ రాజు 33 సంవత్సరాల 2 నెలల పాటు సమాచార శాఖలో వివిధ హోదాల్లో సేవలందిస్తూ ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో తనవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారని అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు. ఆయన భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో భీమవరం అసిస్టెంట్ డైరెక్టర్ టి. మోహన్‌రాజు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ వి. వరప్రసాద్, డివిజనల్ పౌర సంబంధాల అధికారి వి. శేఖర్, సీనియర్ అసిస్టెంట్ కె. వెంకటేశ్వర్లు, టైపిస్టు కె. జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ పి. రవితేజ, రికార్డ్ అసిస్టెంట్ డి. సోమరాజు, సిబ్బంది పి. వీరభద్రం, ఆర్. వైశాలి, ఫోటోగ్రాఫర్ వై. రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరులో సెప్టెంబర్, 12వ తేదీన మెగా జాబ్ మేళా

### జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



**ఏలూరు, బ్యూరో చీఫ్ ఆగష్టు, 31 నంది పత్రిక:** జిల్లాలో 800 మంది నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాల కల్పనకు సెప్టెంబర్, 12వ తేదీన ఏలూరులో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. ఏలూరు కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి యన్.జితేంద్ర బాబుతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలోని గ్రీన్ టెక్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో 800 మెషిన్ ఆపరేటర్ ఉద్యోగాల కోసం ఏలూరులో ఈనెల 12వ తేదీన ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. సదరు ఉద్యోగ మేళాకు స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు డిపార్ట్మెంట్ ఝబంష్టుశ్రీఝఎ కార్యక్రమం ద్వారా నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులు అయిన 2303 మంది నిరుద్యోగ యువతీ యువకులతో పాటు అర్హత కలిగిన ఎవరైననూ పాల్గొనవచ్చన్నారు. ఈ విషయంపై జిల్లాలోని అందరు మునిసిపల్ కమీషనర్లు, ఎంపీడీఓ లతో పాటు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డ్ సచివాలయాల సిబ్బంది అత్యధిక ప్రాధాన్యత నిచ్చి ంష్ట్రశీతీ శ్రీఱర్ చేయబడిన మొత్తం 2303 అభ్యర్థులతో బాటు అర్హతలున్న ఇతర నిరుద్యోగ యువతీ యువకులు తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి యన్.జితేంద్ర బాబు, స్వర్ణగ్రామ,స్వర్ణవార్డు జిల్లా అధికారి జి.వెంకట నాయుడు, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాకు అవమానంపై మూల్యం తప్పదు

## ఖలిస్థానీ వేర్పాటువాదులకు కిరణ్ రిజిజు హెచ్చరిక

న్యూయార్క్‌లో భారత జాతీయ జెండాను అవమానించిన ఖలిస్థానీ వేర్పాటు వాదులకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఇలాంటి వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఎక్స్ వేదికగా హెచ్చరించారు. న్యూయార్క్‌లో మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్ వేదికగా జరిగిన సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ హాజరైన సందర్భంగా స్టేడియం బయట జరిగిన ఈ ఘటన తాలూకు వీడియోను మంత్రి నెట్టింట షేర్ చేశారు. 'ఆర్ఎస్ఎస్‌ను లేదా బీజేపీని విమర్శించే హక్కు మీకు ఉందని మేము ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నాము. కానీ మా దేశాన్ని అవమానించవద్దు. మీరు ఓ విషయాన్ని జాగ్రత్తగా వినండి. మా దేశాన్ని, జెండాను అవమానిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని కేంద్ర మంత్రి తన పోస్టులో వార్నింగ్ ఇచ్చారు. వీడియోలో కనిపించిన దాని ప్రకారం, స్టేడియం బయట ఖలిస్థానీలు నానా రభసా సృష్టించారు. ఓ వ్యక్తి తన కాలికి భారత జాతీయ జెండాను చుట్టుకుని అటూ ఇటూ ఊపుతూ అవమానించాడు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని నెట్టింట పలువురు డిమాండ్ చేశారు. నిందితులను గుర్తించాలని యూఎస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్ఎస్ఎస్ సంస్థ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో ంఊఇంఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన ఈ సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగించారు. అమెరికాలో ఉంటూ ఉపాధి పొందే వారు కర్మ భూమి పట్ల తమ బాధ్యతను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. వివిధ దేశాల్లో హిందువులు బాధ్యతాయుత జీవనంతో ఆదర్శవంతంగా నిలవాలని అన్నారు.

## భారత్ -బంగ్లా సరిహద్దుల్లో భారీగా బంగారం పట్టివేత

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో అక్రమంగా దాచి ఉంచిన బంగారాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్-బంగ్లాదేశ్ సరిహద్దులోని బన్‌పూర్ గ్రామంలో ఓ మహిళ కొంతకాలంగా అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని జవాన్లు గమనించారు. అనంతరం ఆమెపై నిఘా పెట్టి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళ ఇంట్లో సోదాలు చేయగా.. 15.6 కిలోల బంగారం బయటపడింది. దాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పసిడి విలువ రూ.24కోట్లకు పైనే ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం సరిహద్దుకు ఎలా చేరింది? దానిని ఎవరికి ఇవ్వడానికి మహిళ ప్రయత్నిస్తుందనే వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేపట్టారు. దీని వెనుక అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దిశగా ఆరా తీస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## వేమన చెప్పిన నీతిని మనం అనుసరించాలి...

### మాతృభాష ప్రాధాన్యాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించాలి...

### రావులపాలెం సి ఆర్ సి లో జరిగిన వేమన శతకం శతక పద్య సహస్ర గళార్చన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



**కొత్తపేట బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** వేమన చెప్పిన నీతిని మనం అనుసరించాలని, అప్పుడే తెలుగువాడిగా సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా రూపొందుతామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం ప్రగతి భారతమ్ ట్రస్టు, పెరవలి మాతృభాషా పరిరక్షణ సేవా సమితి వారి సంయుక్త ఆధ్వర్యంలో 1008 మంది చిన్నారులకు 108 వేమన పద్యములు రావులపాలెం చిన్నం సుబ్బిరెడ్డి ఫంక్షన్ హాల్ లో సోమవారం వేమన శతకం శతక పద్య సహస్ర గళార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ భాజపా నాయకులు తమలంపూడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మాతృభాష పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థుల చేత వేమన శతకాన్ని అవపోషణ పట్టించడం అభినందనీయమన్నారు. నేటి విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే విధంగా, మంచి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో, తెలుగు భాష గౌరవాన్ని, ఔన్నత్యాన్ని చాటి చెప్పడం కోసం గొప్ప కార్యక్రమాన్ని సి ఆర్ సి లో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు సాంప్రదాయమైన దుస్తులతో, తెలుగుదనం ఉట్టిపడే విధంగా హాజరు కావడం చూస్తే ముచ్చటేస్తుందన్నారు. వారితో వేమన పద్యాలను చదివించారు. వినయం, సత్ప్రవర్తన,నైతిక విలువలు వేమన శతకం వంటి శతకాలను చదవడం ద్వారా అలవాడతాయన్నారు.మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని నిర్వాహకులను అభినందిస్తూ తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల చేత "అన్ని భాషల కన్నా అమ్మ భాష మిన్న"అంటూ నినాదాలు చేయించారు. వేమన శతకంలోని ప్రతిపద్యాన్ని కంఠస్థం చేసి భావాన్ని అర్థం చేసుకొని పాటించినప్పుడే విద్యార్థులకు సత్ఫలితాలు అందుతాయన్నారు. మాతృభాష ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.



## ఎస్సెల్ గ్రూపు దివాళ ప్రకటన

ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్‌చంద్రకు చెందిన మీడియా కంపెనీ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు కుంగాయి. సోమవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో ఇంట్రాడేలో 14 శాతం మేర క్షీణించాయి. రూ.86.90 వద్ద కనిష్ఠాన్ని తాకాయి. ఆ తర్వాత కాస్త కోలుకున్నాయి. గడిచిన నాలుగు సెషన్లలో ఈ షేరు విలువ 17 శాతం మేర పతనమై.. మూడు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఎన్‌సీఎల్‌టీ తీర్పునకు వ్యతిరేకంగా కెనరా బ్యాంక్, యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ అప్పీల్‌కు వెళతామని ప్రకటించిన నేపథ్యంలో ఈ షేర్లు కుంగాయి. ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రణాళిక ఆమోదం పొందడంపై అసమ్మతి రుణదాతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రుణదాతలు పేర్కొన్న రూ.22,006.57 కోట్ల ÷-లకెయిమ్‌లకు గానూ కేవలం రూ.6.5 కోట్లే చెల్లించేలా ఉన్న దివాలా ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలపడంతో ఈ వివాదం మొదలైంది.

## "వన్ హెల్త్" అనే అంశంపై అంతర్జాతీయ సమావేశం



**పోరుమామిళ్ల, ఆగస్టు 31 (నంది పత్రిక ):** వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ రెండవ తేదీన "వన్ హెల్త్" అనే అంశంపై అంతర్జాతీయ సమావేశం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శామ్యూల్ డేవిడ్ రాజ్ తెలిపారు. ఈ సమావేశానికి ఇండియా, మలేషియా మరియు దక్షిణ కొరియా నుంచి శాస్త్రవేత్తలు ఆన్లైన్ విధానంలో పాల్గొంటున్నారని, అలాగే ఈ సమావేశానికి దాదాపు నూట ఇరవైకి పైగా పరిశోధిక అంశాలను పరిశోధకులు సమర్పించారాని సమావేశ కన్వీనర్ జంతుశాస్ర అధ్యాపకుడు డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ తెలిపారు. ఇటువంటి సమావేశాలకు విద్యార్థులు హాజరవడం వలన పరిశోధక రంగంపై ఆసక్తి మరియు పరిశోధరంగంలో ఉన్నటువంటి అపారమైనటువంటి ఉద్యోగ అవకాశాల గురించి అవగాహన కలుగుతుందని తెలిపారు.

## వెలిగొండ ప్రాజెక్టును మొదలుపెట్టింది, పూర్తిచేసి జాతికి అంకితం ఇచ్చింది చంద్రబాబే

### మంత్రులు కందుల దుర్గేష్, ఎన్ఎండి ఫారూఖ్

### ప్రాజెక్టు పరిసరాల్లో నల్లమల, శ్రీశైలం, కంబం చెరువులతో మెగా 'టూరిజం సర్క్యూట్'

### ఐదేళ్ల పాలనలో చేసిందేమీ లేని వైసీపీ.. ఇప్పుడు తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటు : మంత్రులు కందుల దుర్గేష్, ఎన్ఎండి ఫారూఖ్



**నంద్యాల సిటీ బ్యూరో ఆగష్టు 31 ( నంది పత్రిక )** పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు విడుదల చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం అనంతరం నంద్యాలకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు నంద్యాలలో టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రముఖ అడ్వకేట్ రామచంద్రరావు గారి ఇంట్లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, 1996లో చంద్రబాబు నాయుడు గారే వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, మూడు దశాబ్దాల అనంతరం మళ్లీ ఆయనే ప్రారంభోత్సవం చేయడం చరిత్రలో ఎంతో అరుదైన విషయమని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని 'డబుల్ ఇంజన్ సర్కార్' సుపరిపాలన అందిస్తోందన్నారు. వెలిగొండ జలాలు విడుదల కావడంతో నెర్రెలు బారిన భూముల్లో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని, రైతుల ముఖాల్లో చిరునవ్వులు విరబూస్తున్నాయని తెలిపారు. సాగు, తాగునీరు సమృద్ధిగా అందడంతో ఈ ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్య ఇక శాశ్వతంగా చరిత్రలో కలిసిపోతుందని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వెలిగొండ పరిసర ప్రాంతాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. శ్రీశైలం మల్లన్న సన్నిధి, ఆసియాలోనే అతిపెద్ద కంబం చెరువు, భైరవకోణ, నల్లమల అడవులు, టైగర్ రిజర్వ్‌లను కలుపుతూ ప్రత్యేక 'టూరిజం సర్క్యూట్' ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను సీఎం చేతుల మీదుగా ఇప్పటికే ఆవిష్కరించామని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రాజెక్టుకు చేసిందేమీ లేదని, ఇప్పుడు చంద్రబాబు గారు ప్రారంభిస్తే క్రెడిట్ కొట్టేయాలని చూడడం విడ్డూరంగా ఉందని మంత్రి ఫరూక్ ఎద్దేవా చేశారు. ప్రాజెక్టుపై వైసీపీ నేతలు చేస్తున్న నిరసనలు, ధర్నాలు కేవలం ప్రజల దృష్టి మళ్లించేందుకేనని మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్టు కర్త, కర్మ, క్రియ అన్నీ సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. నీటి ఎద్దడి, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ, అన్ని ప్రాంతాల రైతులకు న్యాయం జరిగేలా సమతుల్య విధానంతో అడుగులు వేస్తోందని తెలిపారు.

## ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా మట్టి తరలింపు.. అధికారుల కొరడా



**పోరుమామిళ్ల, ఆగస్టు 31 (నంది పత్రిక)** కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. సర్వే నంబర్ 118లో ప్రభుత్వ భూమి నుంచి ఎలాంటి అనుమతులు, చలానాలు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్ఐ సుధాకర్ రెడ్డి, వీఆర్వో ఓబయ్య సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మట్టి, ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ

### గ్రామపంచాయతీ ఎన్నికలకు 130 పోలింగ్ కేంద్రాలు ఖరారు

### 12 గ్రామపంచాయతీల్లో తుది జాబితా ప్రచురణ



**జూపాడుబంగ్లా, ఆగస్టు: 31 :( నంది పత్రిక )** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని 12 గ్రామపంచాయతీలలోని130 పోలింగ్ కేంద్రాలను ఖరారుచేసినట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుమతితో ఆమోదం పొందిన పోలింగ్ కేంద్రాల ముసాయిదా మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రచురించడం జరిగిందని ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు.గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వివరాలను ఆయా గ్రామపంచాయతీ కేంద్రాల్లో ప్రచురించిన తుది జాబితా ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పద్మావతమ్మ, సీనియర్ అసిస్టెంట్ మధుసూదనయ్య, పాల్గొన్నారు.

# కూటమి అమలు చేస్తున్న సంస్కరణలతో రాష్ట్రాభివృద్ధికి దోహదం





**రంపచోడవరం మండలం,ఉట్ల మరియు బి రామన్నపాలెం గ్రామాలలో ఇంటింటికీ తెలుగుదేశం రెండేళ్ల ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధిపై ప్రచారం చేసిన రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో దోహద పడుతుందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరంమండలం,ఉట్ల మరియు బి రామన్నపాలెం గ్రామాలలో సోమవారం మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంతమోహన్ సౌజన్యంలో రెండేళ్ళ నమ్మకం, సంక్షేమం అభివృద్ధిపై "ఇంటింటికీ తెలుగుదేశం"లి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమెకు ఎన్డీఏ పార్టీ శ్రేణులు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె కూటమి శ్రేణులతో కలసి పండగ వాతావరణంలో గ్రామంలో ఇంటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ పథకాల పై క్షుణ్ణంగా వివరించారు. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభాల్లోకి నెట్టేందిదన్నారు. అలాంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో శరవేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పై చైతన్యం చేశారు. గత పాలకులు రాష్ట్రాన్ని రాజధాని లేని విధంగా తయారు చేసి దిక్కు ముక్కు లేని రాష్ట్రంగా చేశారన్నారు. అలా మూడు ముక్కలాట లతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేస్తే అమరావతి రాజధానిగా చట్టం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే దేశం గర్వించేలా అమరావతిని ఎకనామిక్ రీజియన్ గా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంతమన్నారు. గతంలో రైతుల పాసు పుస్తకాల పై జగన్ రెడ్డి ఫోటో ఉండటం , ప్రభుత్వ భూముల విషయంలో కూడా అనాలోచిత ఏకపక్ష నిర్ణయాలుతో రైతులను తీవ్ర క్షోభకు గురిచేస్తే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాజముద్రతో పట్టదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు . పారదర్శకంగా ప్రతీ గ్రామానికి కావలసిన సదుపాయాలు కల్పించే యోచనలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మేనిఫెస్టోలో ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో మాట ఇచ్చిన ప్రకారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు పెంచి అందిస్తున్నామన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు పేర్కొన్నారు. 269 అన్నా క్యాంటీన్ లు ఏర్పాటు చేసి రూ;5/- లకే భోజనం అందిస్తున్న చరిత్ర మన కూటమి ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్ లను రద్దు చేసి లక్షలాది మంది కడుపు కొట్టినట్లు పేర్కొన్నారు. అలాంటి విధానాన్ని స్వస్తి చెప్పి లక్షలాది మందికి ఆకలి తీరుస్తున్న ప్రభుత్వం మనదే అన్నారు. గృహిణులకు సంవత్సరానికి దీపం పథకం ద్వారా 3 గ్యాస్ సిలిండర్ లు రాయితీల పై అందిస్తున్నట్లు చైతన్యం చేశారు. గత ప్రభుత్వం అమ్మవడి పథకం పేరుతో ఒక ఇంట్లో చదువుకునే అందరికీ అమలు చేస్తామన్న జగన్ కేవలం ఒక విద్యార్థికి మాత్రమే అమలు చేయడం సిగ్గుచేటన్నారు. కానీ కూటమి ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కుటుంబంలో అందరి పిల్లలకు తల్లికి వందనం పూర్తి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో విద్యార్థులకు అందించే బ్యాగ్ లలో జగన్ రెడ్డి ఫోటోలు ఉంటే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అలాంటి వేమీలేకుండా సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫోటోలతో వాటిని సక్రమంగా అందిస్తున్నట్లు పూర్తి నాణ్యతతో కూడిన విధంగా అందిస్తున్నామన్నారు. ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు షూస్ కాస్మొటిక్ వస్తువులు ఇలా అనేకమైన వాటిని విద్యార్థులకు అందిస్తున్న ప్రభుత్వం మనదే అన్నారు. చేనేతలకు, నాయి బ్రాహ్మణులకు ఉచితం విద్యుత్ అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. రైతన్న కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా, వగైరా అవసరమైన ఎరువులు సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా అంద జేస్తున్నామన్నారు. అలాగే రైతులకు వారి వ్యవసాయ పనులు పెట్టుబడులకు అందజేసే అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ద్వారా ఎలాంటి తారతమ్యం లేకుండా నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువ మొత్తంలో విడతల వారీగా నిధులు వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇవే కాకుండా అభివృద్ధిని కూడా పారదర్శకంగా అత్యంత వేగంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కన్నా మెరుగైన పాలన అందిస్తున్న విధానాలపై ఇంటింటికీ వెళ్లి చైతన్యం చేశారు. అలాగే సంక్షేమ పథకాలకు అర్హులైన వారు ఎవరైనా ఉంటే వారికి ఆయా సంక్షేమ పథకాలు అందించే బాధ్యత తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు ఆటో డ్రైవర్ సేవలో భాగంగా రూ;15000/- లు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారు కూడా పథకాలకు దూరం కాకుండా ఆయా శాఖల అధికారులు అర్హులైన వారి జాబితా సిద్ధంచేసి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఇప్పటికే 5 లక్షల గృహాలు పేదలకుఅందించామన్నారు. మత్స్య కారుల సేవలో భాగంగా ఏటారూ;20,000/- లు అందిస్తున్నట్లు తెలిపారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రాయితీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దివ్యాంగ శక్తి పథకం ద్వారా 31 లక్షల ప్రయాణాలు కల్పించినట్లు పేర్కొన్నారు. అలాగే ఆయా పథకాల్లో ఎక్కడ ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అమలు చేసే బాధ్యతను తీసుకున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలు సమస్యలపై ఆమెకు వినతులు రాగా స్పందించిన ఆమె ఆయా శాఖల అధికార యంత్రాంగానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెంటపాటి అనంతమోహన్, ప్రధాన కార్యదర్శి కోసు నాగన్న దొర, క్లస్టర్ ఇంచార్జ్ కారం సింహాచలం, సీతపల్లి బాపనమ్మ తల్లి గుడి చైర్మన్ కుంజం బాపన్న దొర, ఎస్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు పండా చల్లన్న దొర, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, ఉట్ల మాజీ సర్పంచ్ ముర్రం లక్ష్మి, మాజీ ఎంపిటిసి మడకం బాపన్న దొర, యూనిట్ ఇన్చార్జిలు బుడ్డిగా రాజేంద్ర వరప్రసాద్, సిద్ధ వెంకన్న దొర, బలిజ నాగిరెడ్డి, వెలమల కోట మాజీ సర్పంచ్ వంతల అచియమ్మ, కారం శేషాయమ్మ, సాధల సత్యవతి, కారశీ వెంకటేశ్వర్లు, సారపు జోగి దొర, కారం రాజగోపాల్, నరేష్, ఈక నాగన్న దొర, గణపతి, ప్రతివాడ రమణ,వి వి చిన్నలు దొర , పలువురు కూటమి నేతలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





# పశ్చిమగోదావరి జిల్లాకు రెడ్‌క్రాస్ అవార్డుల పంట ..



**202526 సంవత్సరానికి గవర్నర్ గోల్డ్ మెడల్ అందుకోనున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**202425 సంవత్సరానికి అప్పటి జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి గవర్నర్ గోల్డ్ మెడల్ కు ఎంపిక....**

**జిల్లా రెడ్‌క్రాస్‌కు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి....**

**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను విస్తృతం చేయడంతో పాటు, ప్రజలకు మానవతా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు విశేష కృషి చేసినందుకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఐఏఎస్‌కు 202526 సంవత్సరానికి గవర్నర్ గోల్డ్ మెడల్ లభించింది. ఈ అవార్డును విజయవాడలోని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించనున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ అధ్యక్షులు ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ అందుకోనున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రకటన విడుదలైంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో మానవతా సేవలను విస్తృతంగా అందించడంలో, రెడ్‌క్రాస్ సేవల అభివృద్ధికి అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం అందించడంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆమె సూచనలు, ప్రోత్సాహంతో జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి, ప్రజలకు అవసరమైన సేవలను వేగవంతంగా, సమర్థవంతంగా అందించేలా చర్యలు చేపట్టారు. అదేవిధంగా, 202425 సంవత్సరంలో జిల్లాలో రెడ్‌క్రాస్ సేవల విస్తరణకు, నిధుల సమీకరణకు, జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు వంటి కార్యక్రమాలకు విశేష సహకారం అందించిన అప్పటి జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్‌కు కూడా గవర్నర్ గోల్డ్ మెడల్ లభించింది. రెడ్‌క్రాస్ సేవలను జిల్లాలో మరింత బలోపేతం చేయడంలో ఆయన అందించిన సహకారం, సమన్వయం, ప్రోత్సాహాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. మరోవైపు, నూతన 13 జిల్లాల్లో అత్యుత్తమ రెడ్‌క్రాస్ సేవలు అందించినందుకు 202425 సంవత్సరానికి పశ్చిమగోదావరి జిల్లా రెడ్‌క్రాస్‌కు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డా. ఎం.ఎస్.వి.ఎస్. భద్రిరాజు అందుకోనున్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న మానవతా సేవా కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారం లభించింది. రెడ్‌క్రాస్ సేవల్లో పశ్చిమగోదావరి జిల్లాకు అవార్డుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకు జిల్లాకు నాలుగు సార్లు అవార్డులు లభించడం జిల్లాలో రెడ్‌క్రాస్ అందిస్తున్న విశిష్ట మానవతా సేవలకు నిదర్శనంగా నిలుస్తోంది. సేవా కార్యక్రమాలను నిరంతరం విస్తరిస్తూ, రక్త సేవలు, వైద్య సహాయం, తలసేమియా బాధితులకు సేవలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు తదితర రంగాల్లో రెడ్‌క్రాస్ చేస్తున్న కృషికి ఈ అవార్డులు గుర్తింపుగా నిలుస్తున్నాయి.

గత రెండు సంవత్సరాలుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, అప్పటి జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిల సహకారం, మార్గదర్శకత్వంతో జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించామని జిల్లా రెడ్‌క్రాస్ కమిటీ తెలిపింది. ముఖ్యంగా బ్లడ్ సెంటర్, తలసేమియా ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్, మొబైల్ మెడికల్ యూనిట్ వంటి కీలక మానవతా సేవా ప్రాజెక్టులను ప్రారంభించి ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొంది.



# సెప్టెంబర్ 1న అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ...

**జిల్లాలో 2,19,625 మంది లబ్ధిదారులకు**

**రూ.95.21 కోట్లకు పైగా పింఛన్లు ....**

**నర్సాపురం నియోజకవర్గంలో సెప్టెంబర్ ఒకటో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి...**



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ సకాలంలో అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నరసాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి నరసాపురం నియోజకవర్గంలో అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా సెప్టెంబర్ 1వ తేదీన 25 రకాల కేటగిరీలకు చెందిన మొత్తం 2,19,625 మంది లబ్ధిదారులకు రూ.95,21,34,000 విలువైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉదయం నుంచే సంబంధిత సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను నేరుగా అందజేయాలని ఆదేశించినట్లు ఆమె పేర్కొన్నారు. కేటగిరీల వారీగా పింఛన్ల వివరాలు ఇలా ఉన్నాయి: అభయహస్తం కింద 8,544 మంది లబ్ధిదారులకు రూ.44,71,000; అమరావతి ల్యాండ్‌లెస్ పూర్ కింద 4 మందికి రూ.20,000; బైలేటరల్ ఎలిఫాంటియాసిస్ గ్రేడ్4 కింద 40 మందికి రూ.4,10,000; సీకేడీ సీరం క్రియాటినైన్ 5 ఎంజీ కంటే ఎక్కువ ఉన్న వారికి 1 పింఛన్ ద్వారా రూ.10,000; సీకేడీయూ ప్రభుత్వ కేటగిరీలో 233 మందికి రూ.23,80,000; సీకేడీయూ ప్రైవేట్ కేటగిరీలో 257 మందికి రూ.26,00,000; డప్పు కళాకారుల కేటగిరీలో 269 మందికి రూ.10,76,000; దివ్యాంగుల కేటగిరీలో 26,394 మందికి రూ.16,21,74,000 పింఛన్లు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మత్స్యకారుల కేటగిరీలో 4,260 మందికి రూ.1,74,56,000; కిడ్నీ, లివర్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ కేటగిరీలో 62 మందికి రూ.6,30,000; మల్టీడిఫార్మిటీ లెప్రసీ కింద 450 మందికి రూ.27,60,000; వృద్ధాప్య పెన్షన్ కేటగిరీలో 1,09,355 మందికి రూ.45,12,68,000; వీల్‌చైర్ లేదా బెడ్‌కు పరిమితమైన పక్షవాతం బాధితుల కేటగిరీలో 1,010 మందికి రూ.1,51,95,000; కళాకారుల పింఛన్ల కేటగిరీలో 115 మందికి రూ.4,84,000; సైనిక్ వెల్ఫేర్ కేటగిరీలో 10 మందికి రూ.55,000 పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.తీవ్ర హీమోఫీలియా కేటగిరీలో 76 మందికి రూ.7,80,000; తీవ్ర మస్క్యులర్ డిస్ట్రోఫీ కేసులు, ప్రమాద బాధితుల కేటగిరీలో 355 మందికి రూ.53,25,000; సికిల్ సెల్ డిసీజ్ కింద 12 మందికి రూ.1,30,000; ఒంటరి మహిళల కేటగిరీలో 6,675 మందికి రూ.2,76,96,000; థలసేమియా కేటగిరీలో 36 మందికి రూ.3,70,000; కల్లుగీత కార్మికుల కేటగిరీలో 2,764 మందికి రూ.1,11,52,000; సాంప్రదాయ చెప్పుల తయారీదారుల కేటగిరీలో 291 మందికి రూ.11,68,000 పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ కేటగిరీలో 31 మందికి రూ.1,36,000; చేనేత కార్మికుల కేటగిరీలో 2,443 మందికి రూ.1,00,48,000; వితంతువుల కేటగిరీలో 55,938 మందికి రూ.23,43,40,000 విలువైన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పంపిణీలో పారదర్శకత, సమర్థత పాటించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గౌరవప్రదంగా సేవలు అందించాలని సూచించారు. పింఛన్ల పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, మర్యాదపూర్వకంగా పింఛన్లు అందజేయాలని కలెక్టర్ సూచించారు. పంపిణీ సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛన్ సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన నరసాపురం నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పింఛన్లు అందుకోనున్న లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలు

**త్వరలో జిల్లాలకు సేవల విస్తరణ**

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆయా జిల్లాలకూ దశలవారీగా ఐవీఎఫ్ సేవలు విస్తరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యశాఖ అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లలో ఏఆర్టీ, సరోగసీ చట్టాల అమలుపై కఠిన నిఘా ఉంచుతున్నట్లు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే సెంటర్లను ఉపేక్షించబోమని హెచ్చరించారు. తెలంగాణలో 477 ఏఆర్టీ, సరోగసీ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు మంత్రి దామోదర వెల్లడించారు. 379 ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు చేశామని చెప్పారు. 50 చోట్ల డీవియేషన్స్ గుర్తించామని తెలిపారు. 2 సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేశామని.. 9 సెంటర్ల అనుమతులు తాత్కాలికంగా రద్దు చేశామని చెప్పుకొచ్చారు. ఫెర్టిలిటీ సేవల పేరుతో రోగులపై అనవసర ఆర్థిక భారం వద్దని అన్నారు. గాంధీ, పేట్లబురుజు ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్ల పనితీరుపై మంత్రి సమీక్షించారు. రెండు ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్లలో 39,802 మందికి ఫెర్టిలిటీ సేవలు అందిస్తున్నట్లు మంత్రి దామోదర తెలిపారు. 545 ఐవీఎఫ్ కేసులు, 521 ఐయూఐ ప్రక్రియలు పూర్తి చేసినట్లు వివరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ నుంచి జులై మధ్యలో హాస్పిటళ్లు, స్కానింగ్ సెంటర్లలో 2,600 తనిఖీలు నిర్వహించామని తెలిపారు. లింగ నిర్ధారణకు పాల్పడే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

## కర్నాకటలో రైలు ఢీకొని ముగ్గురు మృతి హిందూపురం వాసులుగా గుర్తింపు

బెంగళూరు రూరల్ జిల్లా దొడ్డబల్లాపుర రైల్వే స్టేషన్‌లో ట్రాక్ దాటుతున్న ఓ మహిళ సహా ఇద్దరు బాలికలను రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న యలహంక రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతులు ఏపీ రాష్ట్రం హిందూపురానికి చెందిన ఇర్ఫాన (46), రుకియా (13), రాకియా(8)గా గుర్తించారు. ఆదివారం సెలవు కావడంతో దొడ్డబళ్లపురలోని బంధువుల ఇంటికి వీరు వచ్చారు. సోమవారం ఇంటికి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# 27 బ్లాక్ వరకు కచ్చితంగా నీరు విడుదల చేస్తాం



## త్రాగునీటి సమస్య ఉండదు

## జిల్లాలో ఉన్నటువంటి 150 చెరువులకు నీటిని నింపడం కచ్చితంగా జరుగుతుంది

## ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 31 నంది పత్రిక** రైతులందరికీ చెప్పేదేమిటంటే చెరువులకు ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా నీరు అందించిన తర్వాతనే ఉన్న నీటిని ఆరుతడి పంటలకు నీరు అందిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారుసోమవారం నాడు నంద్యాల కేసీ కెనాల్ కార్యాలయంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొని మీడియాతో మాట్లాడుతూ. గత ఐదు సంవత్సరాలు రైతుల గురించి మాట్లాడని పట్టించుకోని వైసిపి నాయకులు నేడు కేవలం రాజకీయం చేయడం కోసమే వైసిపి నాయకులు కండువాలు వేసుకొని, వారి పబ్లిసిటీ కోసమే ఇదంతా చేస్తున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆరోపించారు. జిల్లాలో ఉన్నటువంటి 150 చెరువులకు నీటి నింపడం కచ్చితంగా జరుగుతుందని ఎందుకంటే రైతులకు నీరు చాలా అవసరమని, తెలియజేశారు, శిల్పా రవి రైతుల కోసం పోరాడుతున్నానంటూ మాట్లాడుతున్నాడు, మీ శిల్పా వెంచర్ వల్ల ఎంతమంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు మీకు తెలియదా, వాటి గురించి మాట్లాడండి అంటూ ఎమ్మెల్యే అన్నారు. భూమా నాగిరెడ్డి బ్రతికున్నప్పుడు వెలుగోడు నుంచి ప్రతి ఒక్క ఇంటికి పైప్ లైన్ వేపించి 150 కోట్ల రూపాయలతో వర్కులు చేపించడం జరిగిందని, మళ్లీ చంద్రబాబు నాయుడు వచ్చిన తర్వాత అమృత్ స్కీం క్రింద వర్క్ చేపించి ప్రతి ఒక్కరికి నీరు అందె లాగా చూశారని, మీ జీవితంలో ఎప్పుడైనా ఇలాంటి మంచి పనులు చేశారని, శిల్పా రవిని ప్రశ్నించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మీరైనా ఇక్కడ ప్రశ్నిస్తున్నారు, మా ఆళ్లగడ్డలో వైసీపీ నాయకులు నిద్రపోతున్నారు వారికి అవగాహన లేదు, ఆళ్లగడ్డలో ప్రతిపక్షం మేమే అధికారపక్షం కూడా మేమే, ఈరోజు కేసీ కెనాల్ సంబంధిత అధికారులతో మీటింగ్ పెట్టుకోవడం జరిగిందని, రెండు రోజుల్లో అన్ని చెరువులకు నీరు రావడం జరుగుతుందని, సంబంధిత మంత్రి మరియు కలెక్టర్ తో మాట్లాడడం జరిగిందని, ఇవన్నీ తెలుసుకునే ఈరోజు రైతుల కోసం వైసీపీ నాయకులు ధర్నా చేస్తున్నట్లు నటించారని అన్నారు 27 బ్లాక్ వరకు కచ్చితంగా నీరు విడుదల చేస్తారని త్రాగునీటి సమస్య ఎక్కడ కూడా ఉండదని ప్రతి ఒక్కరికి తెలియజేసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, రైతులందరికీ ఒకటే తెలియజేస్తున్నాము చెరువులకి ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా నీరు అందించిన తర్వాత ఉన్న నీటిని, ఆరుతడి పంటలకు నీరు అందిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.



# అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన నంద్యాల విద్యార్థిని జగదీశ్వరి





## అభినందించిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

## భూటాన్‌లో జరిగిన 'ఇంటర్నేషనల్ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్' విజేతగా నిలిచిన జగదీశ్వరి

## పెసరాయి గ్రామానికి చెందిన బాలిక ప్రతిభను ప్రశంసించిన మంత్రి ఫరూక్

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 31 ( నంది పత్రిక )** అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించడం గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. భూటాన్‌లోని సామ్‌డ్రప్ జోంగ్ఖార్ వేదికగా ఆగస్టు 24 నుంచి 27 వరకు నిర్వహించిన 'ఇండియా వర్సెస్ భూటాన్ ఖ-15




ఇంటర్నేషనల్ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్'లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి విజేతగా నిలిచిన విద్యార్థిని జగదీశ్వరి, సోమవారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. పెసరాయి గ్రామానికి చెందిన సి. నాగేశ్వరరావు కుమార్తె అయిన జగదీశ్వరి, ప్రస్తుతం నంద్యాల నెరవాడలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశానికి, జిల్లాకు మంచి పేరు తెచ్చిపెట్టిన జగదీశ్వరిని మంత్రి ఫరూక్ శాలువాతో సత్కరించి, సర్టిఫికెట్‌ను అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ క్రీడల్లో పట్టుదల, నిరంతర సాధన ఉంటే అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించవచ్చని జగదీశ్వరి నిరూపించిందన్నారు. ప్రభుత్వం



క్రీడలకు, గ్రామీణ ప్రతిభకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్తులో జగదీశ్వరి మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోవింద్ నాయుడు, బోయ రామకృష్ణ, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, ఆర్ఎంపి శివ, సంజీవ కుమార్ మరియు వాల్మీకి సంఘం ప్రతినిధులు మరియు బాలిక కుటుంబ సభ్యులు, పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం





## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 31 నంది పత్రిక** సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మొగల్తూరులో ముఖ్యమంత్రి పాల్గొనే ప్రజా సభా వేదిక ను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి సభావేదిక ఏర్పాటు, కేడర్ సమావేశం జరిగే ప్రాంతం, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో జరుగు తున్న పనులను పరిశీలించి అధికారు లకు పలు సూచన లు చేశారు. అనంతరం నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి ప్రాంతంలో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వ హించనున్న ప్రాంతాన్ని పరిశీ లించారు. అక్కడ మత్స్యకారులతో కొద్దిసేపు ముచ్చ టించి వారి సమస్య లను అడిగి తెలుసు కున్నారు. అనంతరం గోదావరి పుష్కర ఘాట్ల పరిశీలనలో భాగం గా పొన్నపల్లి పడవల రేవు నుంచి వలంధర రేవు వరకు వశిష్ఠ గోదావరి నదిలో మరపడవపై ప్రయాణించి ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, భీమవరం ఆర్డీవో కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, తాడేపల్లిగూడెం ఆర్డీవో ఎం. సూర్యారావు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



# అప్పును నెత్తిన పెట్టిన కెసిఆర్

## పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ

## 8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు

## మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు

## తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు

## అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు

## అంబర్‌పేట సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి 60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు రూ.70 వేల కోట్లుగా ఉండేవని, కేసీఆర్ మాత్రం తొమ్మిదేళ్ల పాలనలో అప్పులను భారీగా పెంచారని ఆరోపించారు. రూ.70 వేల కోట్ల అప్పును రూ.8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లారని విమర్శించారు. ప్రస్తుతం ఆ అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రతి నెలా భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తోందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా ఏడాదికి సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న సమయంలోనే డిసెంబర్ 7న ప్రభుత్వం తమ చేతుల్లోకి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై భారీగా ఆర్థిక భారాన్ని మోపి వెళ్లిందని విమర్శించారు. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సిఎం మాట్లాడారు. అంబర్‌పేటలో ఏ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయిందన్నారు. కానీ తాము రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడ ఉన్న వాళ్లకు అవి ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితం అయింది. విమానం నుంచి పూలు చల్లిన ఎడ్ల సుధాకర్.. మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ఆలోచించాలన్నారు. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. 2023 డిసెంబర్ 7న మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదని ఎద్దేవా చేశారు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్య మధ్యలో నన్ను బెదిరిస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారైనా ఒకటో తేదీనా జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉందో.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై కూడా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రిటైర్మెంట్ బకాయిల రూపంలో రూ.6 వేల కోట్లను వంద రోజుల్లో చెల్లించామని తెలిపారు. కేసీఆర్ హయాంలో నిలిచిపోయిన పీఆర్సీని తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం అందించే ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధ రించామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలోనూ తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని రేవంత్ తెలిపారు. 32 నెలల్లో ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ ఆర్టీసీకి ఆర్థిక నష్టం రాకుండా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోందని వివరించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని కేసీఆర్‌పై విమర్శలు చేశారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని సీఎం అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో ఆరు నెలల పాటు జీతాలు ఆలస్యమయ్యేవని, ఇప్పుడు ఐదో తేదీకే జీతాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయసు పెంపు, రూ.8 వేల కోట్ల బకాయిల భారాన్ని కూడా గత ప్రభుత్వం తమపై వదిలి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులు గత పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులను పోల్చి చూడాలని సూచించారు.



## ఎపి మద్యం కేసులో సిట్ తీరు

ఏపీలో మద్యం అక్రమ రవాణా కేసులో సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రెండేళ్లుగా కేసు నడుస్తోందని, ఇంతవరకు ఏం కనుగొనలేదని పేర్కొంది. ముందుగా సిట్ తీరును ఎగ్జామిన్ చేసి.. ఆ తర్వాత హైకోర్టు తీర్పును పరిశీలిస్తామని తెలిపింది. రాజ్ కెసిరెడ్డి కేసులో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. రాజ్‌కెసిరెడ్డి పోలీస్ కస్టడీపై నిజంగానే సీరియస్‌గా ఉన్నారా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com